J/Nellore/003/2018-20 R.N.I.No.25359/74
నెల్లూరు, 24.01.2020, శుక్రవారం సంపుటి : 39 సంచిక : 34 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్


వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com



# అమ్మ భాష అమృతమే

## ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రంలో

- తేనెలొలికిన తెలుగు పలుకులు
- ఉట్టిపడిన తెలుగు సాహితీ వైభవం



**నెల్లూరుకు ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయనకేంద్రం రావడం తెలుగువారందరికీ, తెలుగుజాతికంతటికీ గర్వకారణమని తెలుగుభాషావేత్తలు, భాషాభిమానులు, కవులు, రచయితలు అందరూ ఎంతో సంతోషం వ్యక్తం చేశారు. ఈ అధ్యయన కేంద్రాన్ని కర్నాటకలోని మైసూరు నుంచి..తెలుగుగడ్డ మీదకు, అందులోనూ మహాభారతాన్ని ఆంధ్రీకరించి తెలుగుభాషకు అద్వితీయమైన ఖ్యాతిని తెచ్చిన మహాకవి తిక్కన సోమయాజి పుట్టిన సింహపురిసీమకు తీసుకువచ్చేందుకు ఎనలేని కృషిచేసి, అటు జన్మభూమికి, ఇటు కన్నతల్లి వంటి అమ్మభాషకు మహోపకారం చేసిన భారత ఉపరాష్ట్రపతి, నెల్లూరీయుడైన మన వెంకయ్యనాయుడుకు ఈ సందర్భంగా తెలుగువారంతా మనసారా తమ కృతజ్ఞతలు తెలుపుకున్నారు.**

నెల్లూరులో ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం సందర్శనలో భాగంగా రెండురోజులు జరిగిన భారత ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు పర్యటన ఫలప్రదమైంది. తొలిరోజు..ఈనెల 20న వెంకటాచలంలోని సరస్వతినగర్‌లో జరిగిన తెలుగుభాషాభిమానుల కార్యగోష్ఠి సమావేశంలో జిల్లావ్యాప్తంగానే కాక, రాష్ట్ర రాష్ట్రేతర ప్రాంతాల నుంచి ఎందరో (మిగతా 10వ పేజీలో)

# మండలికి... ఇక ముగింపే?



- రూల్ 71 ద్వారా శాసనమండలిలో అడ్డుకున్న తెలుగుదేశం
- సెలెక్ట్ కమిటీకి అభివృద్ధి వికేంద్రీకరణ, సిఆర్‌డిఏ రద్దు బిల్లు
- శాసనమండలి రద్దు యోచనలో సీఎం జగన్

**3 రాజధానులకు నెలల బ్రేక్**

**ఎలెక్ట్ టు సెలెక్ట్... సెలెక్ట్ టు సెలెక్ట్... బిల్లు రూటు...**

**అభివృద్ధి వికేంద్రీకరణ లక్ష్యంతో మూడు రాజధానుల వైపుగా దూసుకుపోతున్న రాష్ట్ర ప్రభుత్వానికి రాష్ట్ర శాసనమండలిలో తాత్కాలిక బ్రేక్ పడింది. శాసనసభలో ఆమోదం పొందిన అభివృద్ధి వికేంద్రీకరణ, సిఆర్‌డిఏ రద్దు బిల్లులను సెలెక్ట్ కమిటీకి పంపుతూ మండలి ఛైర్మెన్ ఎంఏ షరీఫ్ తన విచక్షణాధికారంతో తీసుకున్న నిర్ణయం ప్రభుత్వ ప్రయత్నాలకు ప్రతిబంధకంగా మారింది.**

శాసనసభలో ఆమోదించిన బిల్లును శాసన మండలి ఆమోదించాలి. లేదా సవరణ కోరాలి. కాని, తెలుగుదేశంపార్టీ రూల్ 71 ప్రకారం నోటీసు ఇవ్వడం, విపక్షం ఇచ్చిన నోటీసు నిబంధనలకు అనుగుణంగా లేదని చెబుతూనే మండలి ఛైర్మెన్ తన విచక్షణాధికారాలను ఉపయోగించుకుని సెలెక్ట్ కమిటీకి పంపడం చూస్తుంటే ఇదంతా కూడా చంద్రబాబు కనుసైగలతోనే జరిగినట్లుగా తెలుస్తోంది. మండలి ఛైర్మెన్ ఎంఏ షరీఫ్ రాజ్యాంగ నిబంధనలను కాపాడడం కంటే కూడా, చంద్రబాబు పట్ల తన స్వామిభక్తిని చూపడానికే ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వడంతో ఈ బిల్లును కొద్దిరోజుల పాటు అడ్డుకోగలిగారు.

రాష్ట్రానికి మూడు రాజధానుల కథ క్లైమాక్స్‌కు వచ్చింది. రాజధాని విషయంలో గత ప్రభుత్వాలు చేసిన పొరపాట్లను పునరావృతం కానీయరాదని, అభివృద్ధిని ఒక ప్రాంతానికి కాకుండా (మిగతా 11వ పేజీలో)




# వైకాపా పొచిక.. విపక్షాల్లో చీలిక

- 3 రాజధానులపై అన్ని పార్టీల్లో భిన్న స్వరాలు
- నాయకుల మధ్యే అంతరాలు
- ప్రాంతాల వారీగా చీలిపోయిన కేడర్



**మూడు రాజధానుల విషయంలో ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం విపక్షాలలో చీలికలు, పేలికలకు దారి తీస్తోంది. మూడు రాజధానులపై వైసిపిలో ఒకే మాట, ఒకే బాట వైఖరి నడుస్తోంది. కృష్ణా, గుంటూరు జిల్లాల వైసిపి నాయకులు సైతం మూడు రాజధానుల నిర్ణయాన్ని సమర్థించడమే కాక, మద్దతుగా ర్యాలీలు కూడా నిర్వహించారు. రాజధాని అంశంలో వైసిపి ఒక్కటే ఒకే మాటపై నిలిచివుంది.**

ప్రతిపక్ష తెలుగుదేశంలోనూ దీనిపై భిన్న స్వరాలు వినిపించాయి. చంద్రబాబు అమరావతి ఒక్కటే రాజధానిగా వుండాలంటుండగా, ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన ఆ పార్టీ నాయకులు మాత్రం విశాఖపట్నంలో రాజధానిని స్వాగతిస్తున్నారు. ఈ విషయంలో వాళ్ళు బహిరంగంగా ప్రకటనలు చేయనప్పటికీ అంతర్గతంగా వారి వైఖరి విశాఖపట్నంలో పరిపాలనా రాజధానికి అనుకూలంగానే వుంది.

జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ అయితే నేరుగా బీజేపీ అధిష్టానం వద్దకు కాళ్ళ బేరానికి పోయాడు. రాష్ట్రంలో ఒంటరిగా లేదా చంద్రబాబుతో కలిసి జగన్మోహన్‌రెడ్డితో పోరాడలేనని తెలుసుకుని బీజేపీతో పొత్తు పెట్టుకున్నాడు. జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ అమరావతియే రాజధానిగా వుండాలంటుండగా, నిన్నటి ఎన్నికల్లో ఆ పార్టీ తరపున గెలిచిన ఏకైక ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు మాత్రం (మిగతా 11వ పేజీలో)

# బ్లాక్ టికెట్ల రాకెట్ బట్టబయలు

గత కొన్నేళ్ళుగా గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న బ్లాక్ టికెట్ల రాకెట్‌ను జిల్లా ఎస్పీ భాస్కర్ భూషణ్ బట్టబయలు చేశారు. థియేటర్ల యాజమాన్యం, డిస్ట్రిబ్యూటర్లు కుమ్మక్కై ఈ వ్యాపారం చేస్తున్నారని దర్యాప్తులో తేలింది. పట్టుబడిన వాళ్ళందరూ బడాబాబులు కావడం విశేషం. ఈనెల 20 న నెల్లూరు చిన్నబజార్ పోలీస్‌స్టేషన్లో నగర డీఎస్పీ జె.శ్రీనివాసులురెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ చిన్నబజార్ పోలీస్‌స్టేషన్ సీఐ మధుబాబు, సంతపేట పోలీస్‌స్టేషన్ సీఐ రాములు నాయక్ రెండు బృందాలుగా విడిపోయి ఈనెల 19న రాత్రి అర్చన, ఎస్-2 సినిమా హాళ్ళ వద్ద బ్లాక్ లో టిక్కెట్లు విక్రయిస్తున్న వారిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వీరివద్ద నుంచి నర్తకి, ఎస్-2, అర్చన, లీలామహల్‌లో కొత్తగా విడుదలైన చిత్రాలకు చెందిన 116 టిక్కెట్లు, రూ.16 వేలు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. హరి పిక్చర్ డిస్ట్రిబ్యూటర్ హరి, అతని అనుచరుడు కునాల్, ఎస్-2 మేనేజర్, నర్తకి సూపర్‌వైజర్ బాబు అనే వీరు థియేటర్ యాజమాన్యం, సిబ్బంది సహకారంతో రూ.200 టిక్కెట్లును రూ.500, రూ.600 వరకు బ్లాక్‌లో అమ్మిస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. వీరందరిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. చిన్నబజార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎస్‌కే జాఫర్, ఎం.శ్రీధర్, ఎస్ కే బాబు, సంతపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో సుబ్రహ్మణ్యం, రాజేష్ లను అదుపులోకి తీసుకున్నామన్నారు. చిన్నబజార్ పీఎస్ సీఐ మధుబాబు, సంతపేట పీఎస్ సీఐ రాములునాయక్, చిన్నబజార్ పీఎస్ ఎస్సై అలీ సాహెబ్, సిబ్బంది పాల్గొన్నారు.

## మత్స్య ఉత్పత్తులకు మనదేశం అగ్రగామి

మత్స్య ఉత్పత్తులకు మనదేశం అగ్రగామిగా ఉందని, ఆక్వా ఉత్పత్తుల ద్వారా కోట్ల రూపాయలు విదేశీ మారక ద్రవ్యాన్ని ఆర్జిస్తోందని శ్రీ వెంకటేశ్వర యూనివర్శిటీ ఫిషరీస్ డీన్ డాక్టర్ టీవీ రమణ అన్నారు. నెల్లూరు జిల్లా ముత్తుకూరులోని మత్స్య కళాశాలలో ఆక్వా క్లీనిక్స్, ఆక్వా ప్రెన్యూర్ షిప్ డెవలప్ మెంట్ ప్రోగ్రాం అనే అంశంపై ఫిబ్రవరి 17 వ తేదీ వరకు జరిగే శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ఈనెల 21 న ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వెనామీ రొయ్యల పెంపకంలో మన రాష్ట్రం అగ్రస్థానంలో వుందన్నారు. ఆక్వా రంగంలో రెండంకెల వృద్ధి సాధించేందుకు కృషి జరుగుతోందన్నారు. చెన్నై అన్నా యూనివర్శిటీ విశ్రాంత ప్రాజెక్ట్ అడ్వైజర్ డాక్టర్ పీ. నమ్మాళ్వార్ మాట్లాడుతూ మత్స్య ఉత్పత్తుల్లో మనదేశం అగ్రగామిగా ఉన్నప్పటికి కేంద్రంలో మత్స్య మంత్రిత్వశాఖ లేకపోవడం విచారకరమన్నారు. జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ వైవీ రామప్రసాదరెడ్డి, నాబార్డు జిల్లా మేనేజర్ ఎం.రవిసింగ్, అసోసియేట్ డీన్ డాక్టర్ హరిబాబు, కోర్సు డైరెక్టర్ డాక్టర్ ఏ బాలసుబ్రహ్మణ్యం, కోఆర్డినేటర్ డాక్టర్ టి.నీరజ, అసిస్టెంట్ ప్రొఫెసర్ కె.శ్రావణి పాల్గొన్నారు.

## అమరావతిలోనే రాజధానిని కొనసాగించాలి

అమరావతిలోనే రాజధానిని కొనసాగించాలని, ఎలాంటి ఆధారాలు లేకుండా ఇన్‌సైడ్ ట్రేడింగ్ పేరుతో రాజధాని తరలింపు తగదని, రైతులు 33 వేల ఎకరాలు రాజధానికిచ్చి త్యాగం చేశారని రాజ్యసభ సభ్యుడు కనకమేడల రవీంద్రబాబు పేర్కొన్నారు. అమరావతినే రాజధానిగా కొనసాగించాలంటూ టీడీపీ ఆధ్వర్యంలో నెల్లూరు జిల్లా వింజమూరు మండలంలోని బత్తినవారిపల్లె నుంచి చాకలకొండ మీదుగా గోళ్లవారిపల్లె వరకు ఈనెల 18 న భారీ ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీద రవిచంద్ర మాట్లాడుతూ ఐదు కోట్ల ఆంధ్రుల ఊపిరి అమరావతి, ప్రజా రాజధాని, ప్రజల కలల రాజధాని అమరావతి అని అన్నారు. రాజధానిని మూడు ముక్కలు చేసి ఎవ్వరికీ ఉపయోగం లేకుండా చేయనున్నారని మండిపడ్డారు. రాయలసీమ జిల్లాల వారు పలుమార్లు ముఖ్యమంత్రులుగా ఉన్నా నేటికి రాయలసీమలో నీటి సమస్య ఉందన్నారు. ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకటరామారావు, జడ్పీ మాజీచైర్మన్ పి. చెంచలబాబు యాదవ్, మాజీఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, టీడీపీ నాయకులు కన్నబాబు, చల్లా వెంకటేశ్వర్లు, యన్నం రామచంద్రారెడ్డి, కె.నాగిరెడ్డి పాల్గొన్నారు.

## పరిశోధనలపై ఆసక్తి పెంచుకోవాలి

విద్యార్థులు పరిశోధనలు చేయడంపై ఆసక్తి పెంచుకోవాలని ఎస్వీ యూనివర్శిటీ మాజీ వీసీ జయరామిరెడ్డి సూచించారు. ఈనెల 22 న విద్యానగర్ లోని ఎన్‌బీకేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో జూనియర్ ఇంటర్ విద్యార్థుల కోసం ఇన్‌స్పైర్ సైన్స్ సదస్సును ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ వీసీ పాల్గొని మాట్లాడుతూ ప్రపంచీకరణ నేపథ్యంలో శాస్త్ర, సాంకేతిక రంగాల్లో సరికొత్త మార్పులు వస్తున్నాయన్నారు. ఇంటర్ విద్యార్థుల కోసం ఎన్‌బీకేఆర్‌లో ఇలాంటి సదస్సులు నిర్వహించడాన్ని కొనియాడారు. రాష్ట్ర ఉన్నత విద్య కౌన్సిల్ ఛైర్మన్ హేమచంద్రారెడ్డి మాట్లాడుతూ విద్యార్థి జీవితంలో ఇంటర్మీడియట్ దశ ఎంతో కీలకమైందన్నారు. భావి శాస్త్రవేత్తలుగా ఎదిగేందుకు కృషి చేయాలన్నారు. కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ సైన్స్ పట్ల మక్కువ పెంచుకుని, కొత్త ఆవిష్కరణలకు రూపకల్పన చేయాలన్నారు. దీని కోసమే ఐదురోజులపాటు శిక్షణ ఇస్తున్నామన్నారు. సైన్స్ అండ్ హ్యూమానిటీస్ హెచ్ఓడీ చింతా రవీంద్రరెడ్డి, ఇన్‌స్పైర్ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

### 'ప్రజల చెంతకు ప్రభుత్వం'.. అందుకు

# సచివాలయమే.. సరైన మార్గం

- 530 రకాల సేవలు..ఇక గ్రామ సచివాలయాల నుంచే
- సరికొత్త వ్యవస్థకు శ్రీకారం చుట్టనున్న ప్రభుత్వ యంత్రాంగం



*ఏ పని జరగాలన్నా లేనిపోని కాలయాపన, ఇతరత్రా అధిక వ్యయప్రయాసలు లేకుండా ప్రజలకు అవసరమైన అనేక సేవలను నేరుగా గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల చెంతకు తీసుకువచ్చేందుకు దాదాపు రంగం సిద్ధమైంది. సుమారు 530 రకాల సేవలను ఒకే వేదిక ద్వారా ప్రజలకు నేరుగా అందించేందుకు, ప్రజాసంక్షేమ పథకాలను ప్రజల ముంగిళ్ళకే చేర్చేందుకు నూతన ప్రణాళికలను పటిష్టవంతంగా కార్యరూపంలో పెట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం సమాయత్తమైంది. ప్రజల చెంతకు ప్రభుత్వం అనే ధ్యేయంతో రూపొందిస్తున్న ఈ నూతన వ్యవస్థ పటిష్టంగా అమలులోకి వచ్చేందుకు జిల్లా అధికార యంత్రాంగమంతా దృష్టి సారించింది.*

రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి సారథ్యంలో, రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గ్రామ సచివాలయాలు ప్రజలకు మరింత చేరువ కానున్నాయి. ఇక అన్ని శాఖలకు సంబంధించిన ధృవీకరణ పత్రాలను ప్రజలు ఈ గ్రామ సచివాలయాల నుంచే పొందేలా జిల్లా అధికార యంత్రాంగం పటిష్టమైన ప్రణాళికలను రూపొందిస్తోంది. త్వరలోనే ఆ మేరకు ఈ నూతన వ్యవస్థకు శ్రీకారం చుట్టనున్నారు. ప్రభుత్వం అందించే అన్ని సేవలు, సంక్షేమ పథకాలు ప్రజలకు సులభంగా చేరువ కావాలన్నదే ప్రభుత్వ ఉద్దేశ్యం. ఇప్పటిదాకా 'మీ సేవ' కేంద్రాల ద్వారా అందించే సేవలను ఇక ప్రభుత్వమే స్వయంగా అందించాలనే సంకల్పంతో ఉంది. దీంతో ప్రజలకు మీసేవ కేంద్రాల చుట్టూ తిరిగే అవస్థ తప్పినట్లవుతుంది. రాష్ట్ర ప్రభుత్వం ముందుచూపుతో ఏర్పరచిన గ్రామ సచివాలయాలు, వార్డు సచివాలయాలను ఇందుకోసం వినియో గించుకోనున్నారు.

**'మీసేవ'తో పాటు మరో 386 రకాల సేవలు**

ప్రస్తుతం మీసేవ కేంద్రాలు అందిస్తున్న 144 రకాల సేవలతో పాటు, మరో 386 రకాల సేవలను ఒకే వేదిక ద్వారా ప్రజలకు అందించేందుకు రంగం సిద్ధమైంది. అందుకోసం ఒక వెబ్‌సైట్‌ను కూడా రూపొందించారు. డబ్ల్యూడబ్ల్యూ డబ్ల్యూ. గ్రామవార్డు సచివాలయఏపీ. జీవోవీ అనే వెబ్‌సైట్‌ను రూపొందించారు. గ్రామ, వార్డు సచివాలయాల్లోని 11 శాఖలకు సంబంధించిన అధికారులకు మాత్రమే ఈ వెబ్‌సైట్‌లోకి ప్రవేశించ గలిగే వీలుంటుంది. దీనికోసం ఆయా అధికారులకు ప్రత్యేక పాస్‌వర్డ్‌లుంటాయి.

**27 శాఖల సేవలు వెబ్‌సైట్‌లో**

మొత్తం 27 శాఖలకు సంబంధించిన సేవలు ఈ వెబ్‌సైట్‌లో ఉండేవిధంగా రూపకల్పన చేశారు. ఇక్కడ నుంచి అందించే సేవలకు ప్రస్తుతానికి ఎలాంటి రుసుమూ లేదు, ప్రజలు దరఖాస్తు చేసుకున్న తర్వాత దానికి సంబంధించిన రశీదును అందిస్తారు, కావాల్సిన పత్రాలను అక్కడే ప్రింట్‌చేసి ఇస్తారు. ఇందుకోసం అవసరమైన సామాగ్రిని గ్రామ సచివాలయలకు అందించనున్నా రని సమాచారం. ఇందుకోసం జిల్లాలోని ప్రతి గ్రామ, వార్డు సచివాలయాలకు 2 కంప్యూటర్లు, ఒక ప్రింటర్, ఒక యుపిఎస్, ఒక లామినేషన్ యంత్రాన్ని కూడా ఇవ్వనున్నట్లు తెలుస్తోంది.

**'స్పందన'కు ప్రత్యేక విభాగం :**

అంతేకాదు, తమ సమస్యలు పరిష్కరించాలంటూ అర్జీ దారులు అధికారుల చుట్టూ తిరక్కుండా నేరుగా గ్రామ సచివాలయాల్లోనే దరఖాస్తు చేసుకునేవిధంగా, కొత్తగా రూపొందించిన వెబ్‌సైట్‌లో 'స్పందన' కార్యక్రమం కోసం ప్రత్యేకించి ఒక విభాగాన్ని కూడా ఏర్పాటు చేస్తుండడంతో, మనం చేసుకున్న దరఖాస్తు ఏ అధికారి వద్ద పెండింగ్‌లో ఉందో కూడా తెలుసుకునేవిధంగా పూర్తిస్థాయిలో పకడ్బందీగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. దీంతో కొద్దిరోజుల్లోనే... ప్రజలంతా కోరుకుంటున్న ప్రజల చెంతకు పాలన.. కళ్ళముందు సాక్షాత్కరించనుంది.

### ఫిబ్రవరి 4 నుండి

## క్రికెట్ పోటీలు

నెల్లూరు కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో ఈనెల 21న రెవెన్యూ ఆటల పోటీల కోఆర్డినేషన్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో నెల్లూరు జాయింట్ కలెక్టర్-2 కమల కుమారి, డీఆర్వో జే.మల్లిఖార్జున, తెలుగు గంగ ప్రాజెక్ట్ ప్రత్యేకకలెక్టర్ నాగేశ్వరరావు పాల్గొని మాట్లాడుతూ ఫిబ్రవరి 4,5 తేదీ లలో క్రికెట్ పోటీలు నిర్వహించాలని సూచించారు. 6న కలెక్టర్, ఎస్పీ జట్ల మధ్య క్రికెట్ పోటీలు ఉంటాయన్నారు. 7,8,9 తేదీలలో అథ్లెటిక్స్ పోటీలు జరుగుతాయని, ఆటల పోటీల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. ఆటల పోటీల నిర్వహణకు కమిటీలను ఏర్పాటు చేస్తామన్నారు. డీఆర్డీఏ పీడీ శీనా నాయక్, డీయస్ ఓ బాలకృష్ణారావు, టీజీపీ ఆత్మకూరు డిప్యూటీ కలెక్టర్ సువర్ణమ్మ, సెట్నల్ సీఈఓ సుస్మితారెడ్డి, డిప్యూటీ కలెక్టర్లు నాగలక్ష్మీ, దాస్, నెల్లూరు డీఏఓ మధుసూదనరావు, ఏపీఆర్‌ఎస్ఏ నాయకులు అల్లంపాటి పెంచలరెడ్డి, రాఘవేంద్రరావు పాల్గొన్నారు.

# విఎస్‌యుకి యుజిసి గుర్తింపు

## - ఇక వేగవంతం కానున్న అభివృద్ధి

నెల్లూరు జిల్లాలోని విక్రమసింహపురి విశ్వవిద్యాలయానికి తాజాగా యుజిసి (యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్) నుంచి 12-బి గుర్తింపు లభించింది. దీంతో ఈ విశ్వవిద్యాలయం అభివృద్ధి వేగవంతమవుతుందని అందరూ భావిస్తున్నారు. 2008లో ఈ విశ్వవిద్యాలయం మంజూరైంది. 2017 దాకా నెల్లూరులో తాత్కాలిక భవనాల్లోనే దీనిని నిర్వహించారు. 2017 నుంచి వెంకటాచలం మండలంలోని కాకుటూరులో నిర్మించిన సొంతభవనాల్లోకి మార్చారు. అయితే విశ్వవిద్యాలయానికి యుజిసి గుర్తింపు లేకపోవడంతో నిధులు మంజూరు అంతంతమాత్రంగానే ఉండేది. పూర్తిస్థాయిలో సదుపాయాలు, అధ్యాపకుల నియామకం లేకపోవడంతో వియస్‌యుకి యూజీసి గుర్తింపు రాలేదు. ఆ తర్వాత విఎస్‌యులో భవనాలు, వసతిగృహాలు ఏర్పడ దంతో గత ఏడాది వీసీ సుదర్శనరావు, రిజిస్ట్రార్ అందె ప్రసాద్ ఆమేరకు జరిగిన అభివృద్ధిని యుజిసికి తెలియజేయడం, ప్రభుత్వం కమిటీ నియమించి ఆ అభివృద్ధిని పరిశీలించడం జరిగాయి. తాజాగా యుజిసి 12-బి గుర్తింపునివ్వడంతో విఎస్‌యుకి కేంద్రం నుంచి కూడా నిధులు మంజూరుకానున్నాయి. అభివృద్ధికి మరింత వీలు కలుగుతుందని విఎస్‌యు అధికారులు, విద్యార్థులు అంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## మునిసిపల్ టౌన్ ప్లానింగ్ ఏసీపీ బదిలీ

నెల్లూరు నగరపాలక సంస్థ అసిస్టెంట్ సిటీ ప్లానర్ రామలింగేశ్వరరెడ్డిని అనంతపురం కార్పొరేషన్‌కు బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈయన నెల్లూరు కార్పొరేషన్లో ఏడాదిగా విధులు నిర్వర్తిస్తున్నారు.



## సియంకె ఆసుపత్రిని సందర్శించిన కంచి పీఠాధిపతి

కంచి కామకోటి పీఠాధిపతి శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వామీజీ ఈ నెల 18వ తేదీన చెన్నై కల్‌పాకలోని అఖిలభారత తెలుగు సమాఖ్య కన్వీనర్ ప్రొ. డా. సియంకె రెడ్డి హాల్‌స్టెడ్ సర్జికల్ క్లినిక్‌ను సందర్శించారు. స్వామీజీకి డాక్టర్ సియంకె రెడ్డి, వారి సోదరుడు డాక్టర్ మోహన్‌రెడ్డి ఘనస్వాగతం పలికారు. 16ఏళ్ళ క్రితం 2004లో స్వర్గీయ శ్రీ శంకర జయేంద్ర సరస్వతి చేతుల మీదుగా ఈ ఆసుపత్రిలో ప్రారంభించిన ఫ్రీ క్లినిక్ ద్వారా ప్రతి గురువారం పేద రోగులకు ఉచిత వైద్యసేవలు అందిస్తుండడం అభినందనీయమని, 50ఏళ్ళుగా డా. సియంకెరెడ్డి అటు వైద్య రంగానికి ఇటు తెలుగు సమాజానికి చేస్తున్న సేవలు అపురూపమని ఈ సందర్భంగా స్వామిజీ ప్రశంసించారు.

### వచ్చే ఏడాది నుండే..

## కావలిలో కేంద్రీయ విద్యాలయం

- ఆదాలకు కేంద్రమంత్రి రమేష్ పొఖ్రియాల్ హామీ



కావలిలో భూమిని కేటాయిస్తే వచ్చే ఏడాది నుండే కావలిలో కేంద్రీయ విద్యాలయాన్ని ప్రారంభిస్తామని నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డికి కేంద్ర మానవ వనరుల శాఖ మంత్రి రమేష్ పొఖ్రియాల్ హామీ ఇచ్చాడు. 21వ తేదీన వెంకటాచలంలో ప్రాచీన తెలుగు అధ్యయన కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన కేంద్రమంత్రిని ఎంపి ఆదాల ప్రభాకర్‌రెడ్డి కలిసి కావలిలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు గురించి ప్రస్తావించగా, అక్కడ భూమిని కేటాయించిన వెంటనే పనులు మొదలుపెడతామని రమేష్ పొఖ్రియాల్ హామీ ఇచ్చాడు.

## కలెక్టర్, ఎస్పీలను కలిసిన ఆదాల






నెల్లూరు లోక్‌సభ సభ్యులు ఆదాల ప్రభాకర్‌రెడ్డి 22వ తేదీ సాయంత్రం జిల్లా కలెక్టర్ ఎం.వి.శేషగిరిబాబును ఆయన ఛాంబర్‌లో కలిశాడు. నెల్లూరు లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని పలు సమస్యలను ఆయన కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చాడు. గురువారం జిల్లా ఎస్పీ భాస్కర్‌భూషణ్‌ను ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశాడు. ఆయన వెంట జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఛైర్మెన్ ఆనం విజయకుమార్‌రెడ్డి, విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, వైసిపి నాయకులు స్వర్ణ వెంకయ్య, పి.కోటేశ్వరరెడ్డి, నిజాముద్దీన్, హరిప్రసాద్‌లు వున్నారు.



గురువారం నెల్లూరులోని జిల్లా బీజేపీ కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు జి.భరత్‌కుమార్‌ను కలిసి సంయుక్త కార్యాచరణపై చర్చిస్తున్న జనసేన రాష్ట్ర అధికార ప్రతినిధి చెన్నారెడ్డి మనుక్రాంత్‌రెడ్డి



### కొత్తూరులో ఫిబ్రవరి 16 నుంచి..

## 'సుందరకాండ' కథా గాన సప్తాహం



- ప్రఖ్యాత హనుమదుపాసకులు డా. పి.శ్రీనివాస్ స్వామీజీ రాక
- శ్రీ సాయి కల్యాణమందిర ప్రాంగణం.. కథాగాన సప్తాహ వేదిక



*ఏడురోజుల పాటు అత్యద్భుతమైన సుందరకాండ పారాయణం, ఓ రోజు కన్నులపండువగా శ్రీ సీతారామ కల్యాణ మహోత్సవం, ఆ తర్వాత శివరాత్రి పండుగ సందర్భంగా ఆ పరమేశ్వరునికి అభిషేకాలు, రుద్రహోమం వగైరా విశిష్ట పూజలతో కొత్తూరులోని శ్రీ షిరిడీ సాయిబాబా కల్యాణ మందిరం పులకించిపోనుంది. అందులోనూ ఈ దైవకార్యాలు ప్రఖ్యాత హనుమదుపాసకులు శ్రీ శ్రీనివాస్ స్వామీజీ నేతృత్వంలో జరుగనుండడం గొప్ప విశేషం. కొత్తూరులోని శ్రీ షిరిడీ సాయిబాబా మందిరం వ్యవస్థాపకులు, భగవద్భక్తులైన కలికి కోదండరామిరెడ్డి, కలికి శ్రీలతల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు ఎంతో వైభవంగా జరుగనున్నాయి. కొత్తూరు గ్రామవాసులకే కాక, జిల్లాలోని భక్తజనులందరికీ కలికి దంపతులు కల్పిస్తున్న ఇదో అపూర్వ అవకాశం.*

ఇందుకూరుపేట మండలం, కొత్తూరు గ్రామంలోని శ్రీ షిరిడీ సాయి బాబా కల్యాణమందిరంలో ఫిబ్రవరి 16 నుంచి 22వ తేది వరకు ప్రతి రోజు సాయంత్రం 6 నుంచి 9 గంటల వరకు 'సుందరకాండ కథాగాన సప్తాహం' నిర్వహించేందుకు మందిరం నిర్వాహకులు పెద్దఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. ఇదెంతో గొప్ప దైవకార్యం. ఎంతో అపురూపమైనది కూడా. కీ.శే సుందరదాసు శ్రీ ఎంఎస్ రామారావు రచించి స్వరపరిచి గానం చేసి లోకవిఖ్యాతం చేసిన 'సుందర కాండ'ను, వారి మనుమడు ప్రసిద్ధ హనుమదుపాసకులు, పూజ్య గురుదేవులు శ్రీ శ్రీనివాస్ స్వామీజీ తన అద్వితీయమైన గానంతోను, వివరణాత్మక వ్యాఖ్యానంతోనూ భక్తులను తరియింపజేయనున్నారు. ఇంతటి మహనీయమైన కార్యక్రమం ఎంతో అరుదైనది కనుక, భక్తులందరూ పెద్దఎత్తున తరలివచ్చి ఆ కథాగానాన్ని విని తరించాలని నిర్వాహకులు కోరుతున్నారు. ఈ సప్తాహం పూర్తయిన మరుసటి రోజు అంటే ఫిబ్రవరి 23వ తేది ఆదివారం ఉదయం 11 గంటలకు ఇదే ప్రాంగణంలో శ్రీ సీతారామ కల్యాణ మహోత్సవాన్ని కూడా అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. స్వామివార్ల కల్యాణం అనంతరం భక్తులందరికీ అన్నప్రసాద వితరణ జరుగుతుంది.

### 'శివరాత్రి'కి విశిష్ట కార్యక్రమాలు

శివరాత్రి పర్వదినం రోజున ఫిబ్రవరి 21వ తేది కొత్తూరులోని శ్రీ షిరిడి సాయిబాబా మందిర ప్రాంగణంలో పరమశివునికి రుద్రాభిషేకం, సహస్ర లింగార్చన, రుద్రహోమం వైభవోపేతంగా నిర్వహించనున్నారు. అదేరోజు సాయంత్రం 6 గంటలకు నేత్రపర్వంగా సహస్ర దీపోత్సవంతో పాటు రాత్రి 10.30 గంటల నుండి 12.30 గంటల వరకు స్వామివారికి అభిషేకం నిర్వహి స్తారు. వేకువన 1 గంట నుండి 5 గంటల వరకు కన్నులపండువగా శివపార్వతుల కల్యాణోత్సవం జరుగుతుంది. ఈ కార్యక్రమాలన్నీ శ్రీ శ్రీనివాస్ స్వామీజీ ఆధ్వర్యంలో జరుగుతాయని, భక్తులందరూ ఈ కార్యక్రమాలకు విచ్చేసి స్వామివార్ల కృపా కటాక్షాలకు పాత్రులు కావాలని ఆలయ వ్యవస్థాపకులు, శ్రీ షిరిడి సాయిబాబా రూరల్ వెల్ఫేర్ ట్రస్ట్ నిర్వాహకులైన కలికి కోదండ రామిరెడ్డి, కలికి శ్రీలత కోరారు. అభిషేకం, శివపార్వతుల కల్యాణమహోత్సవంలో పాల్గొనదలచిన భక్తులు, విరాళాలు ఇవ్వదలచినవారు కొత్తూరులోని శ్రీ సాయిబాబా మందిర ప్రాంగణంలో వివరాలను పొందవచ్చని ఈ సందర్భంగా నిర్వాహకులు తెలియజేశారు.

## విపిఆర్ కళ్యాణ మండపంలో టిటిడి కళ్యాణ రథం

ధర్మ ప్రచారంలో భాగంగా తిరుమల తిరుపతి దేవస్థానం వారి శ్రీవారి కళ్యాణ రథం ఈనెల 21 నుండి 23వరకు నెల్లూరు కనుపర్తిపాడులోని విపిఆర్ కన్వెన్షన్ సెంటర్ నందు ఉంచారు. కళ్యాణ రథానికి భక్తులు ఘనస్వాగతం పలికారు. ఈ మూడురోజుల పాటు స్వామి అమ్మవార్లకు కళ్యాణాలు, ప్రత్యేకపూజలు నిర్వహించారు. 21వ తేదీ జరిగిన కళ్యాణంలో టిటిడి పాలకమండలి సభ్యురాలు శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పాల్గొని స్వామి అమ్మవార్లకు పూజలు నిర్వహించారు.



## నెల్లూరీయులకు 'మెడికవర్' సేవలు

### సింహపురి ఆసుపత్రిలో మెజార్టీ వాటాదారు

ఎన్నో ఏళ్లుగా నెల్లూరుజిల్లాతో పాటు కడప, చిత్తూరు, ప్రకాశం జిల్లాల ప్రజలకు వైద్యసేవలందించిన నెల్లూరు, చింతారెడ్డిపాలెం జంక్షన్‌లోని సింహపురి హాస్పిటల్ కొత్త రూపు సంతరించుకుంది. ఇది మెడికవర్ హాస్పిటల్‌గా మారింది. యూరప్‌కు చెందిన మెడికవర్ హాస్పిటల్స్ సింహపురి హాస్పిటల్స్‌లో 80శాతం వాటాను కొనుగోలు చేశాయి. ఇటీవల నెల్లూరులోని మినర్వా హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మెడికవర్ ఇండియా ఛైర్మెన్ డాక్టర్ అనిల్‌కృష్ణ దీనికి సంబంధించిన వివరాలను వెల్లడించారు. మల్టీస్పెషాలిటీ హాస్పిటల్స్ మరియు డయాగ్నోస్టిక్ రంగాల్లో అంతర్జాతీయ ఖ్యాతినార్జించిన మెడికవర్ గ్రూప్ ఆంధ్రప్రదేశ్‌లో విస్తరణలో భాగంగా నెల్లూరులోని 300 పడకల సామర్థ్యం గల సింహపురి హాస్పిటల్‌లో 80శాతం వాటాను కొనుగోలు చేసింది. ప్రపంచ వ్యాప్తంగా 11దేశాలలో ఆసుపత్రులను కలిగిన మెడికవర్ కొన్నేళ్ళ క్రితం ఢిల్లీలో సంతాన సాఫల్య కేంద్రాలను ప్రారంభించడం ద్వారా భారతదేశంలో అడుగుపెట్టింది. రాష్ట్రంలో అతిత్వరలోనే ప్రత్యేక క్యాన్సర్ ఆసుపత్రిని కూడా ప్రారంభించనుంది. ఆంధ్ర, తెలంగాణ, మహారాష్ట్రాలలో మొత్తం 11 ఆసుపత్రులను కలిగివుంది. త్వరలో శ్రీకాకుళంలోనూ మెడికవర్ ఆసుపత్రిని ఏర్పాటు చేయనున్నట్లు అనిల్‌కృష్ణ తెలిపారు. మెడికవర్ సిఏఓ వంశీమోహన్, సింహపురి హాస్పిటల్స్ డైరెక్టర్ సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ అనిల్‌కృష్ణ

## 'ప్రభా'తం

# చావు హెచ్చరిక



**దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఢిల్లీ నిర్భయ గ్యాంగ్ రేప్, హత్య కేసులో నలుగురు నిందితులకు బ్రతకడానికి అన్ని దారులు మూసుకుపోయాయి. క్రింది కోర్టు నుండి సుప్రీం కోర్టు దాకా నిందితులకు ఉరిశిక్షలే ఖరారు చేశాయి. చివరి ఆశగా నిందితుల తరపున క్షమాభిక్ష కోరుతూ రాష్ట్రపతి వద్దకు ఫైల్ వెళ్లడం, క్షమాభిక్ష విన్నపాన్ని రాష్ట్రపతి తిరస్కరించడం జరిగిపోయాయి. రాష్ట్రపతి క్షమాభిక్ష తిరస్కరించడంతో తీహార్ జైలులో నిందితులను ఫిబ్రవరి 1వ తేదీన ఉరి తీసేందుకు సన్నాహాలు మొదలయ్యాయి. ఇప్పటికే డెత్‌వారెంట్ జారీ చేశారు.**

అడవిలో లేడిపిల్ల ఒంటరిగా వుంటే తోడేళ్లు పైనపడతాయి, చంపి తింటాయి. ఇక్కడ తోడేళ్లకు జ్ఞానం లేదు, వాటి పుట్టుకే అలా వుంది. మాంసమే వాటి ఆహారం. ఇక్కడ లేడిపిల్ల వాటికి శత్రువు కాదు, దానిని చంపడం తోడేళ్ల లక్ష్యం కాదు. కేవలం ఆహారం కోసం జరిగే పోరాటంలో ఒక జంతువుకు ఇంకో జంతువు బలవుతుంది.

కాని అడవిలో జంతువులకు, సమాజంలో మనుషులకు చాలా తేడా వుంటుంది కదా! జంతువులకు లేని జ్ఞానం మనుషులకుంది కదా! వాటికి లేని నోరు మనుషులకుంది కదా! ఏది మంచో, ఏది చెడో మనసుకు తెలుస్తుంది కదా! కాని మనిషికి అన్నీ తెలిసినా కొన్ని సందర్భాలలో మృగానికన్నా ఘోరంగా తయారవుతున్నాడు. సాటి మనుషులనే కబళిస్తున్నాడు. మనకు నష్టం జరుగుతున్నప్పుడు జ్ఞానం లేని క్రూరమృగాలనే హతమారుస్తున్న మనం, ఇక అన్నీ తెలిసి మనుషులుగా కాకుండా మృగాల్లా ప్రవర్తించే మానవ మృగాలను ఎలా క్షమించగలం?

ఇప్పుడు అదే జరిగింది. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఢిల్లీ నిర్భయ గ్యాంగ్ రేప్, హత్య కేసులో నలుగురు నిందితులకు బ్రతకడానికి అన్ని దారులు మూసుకుపోయాయి. క్రింది కోర్టు నుండి సుప్రీం కోర్టు దాకా నిందితులకు ఉరిశిక్షలే ఖరారు చేశాయి. చివరి ఆశగా నిందితుల తరపున క్షమాభిక్ష కోరుతూ రాష్ట్రపతి వద్దకు ఫైల్ వెళ్లడం, క్షమాభిక్ష విన్నపాన్ని రాష్ట్రపతి తిరస్కరించడం జరిగిపోయాయి. రాష్ట్రపతి క్షమాభిక్ష తిరస్కరించడంతో తీహార్ జైలులో నిందితులను ఫిబ్రవరి 1వ తేదీన ఉరి తీసేందుకు సన్నాహాలు మొదలయ్యాయి. ఇప్పటికే డెత్‌వారెంట్ జారీ చేశారు.

ఎనిమిదేళ్ల క్రితం ఢిల్లీ నడిబొడ్డులో జరిగిన ఘోరం ఈరోజుకీ జనం మరచిపోలేదు. బస్సులో ఎక్కిన నిర్భయ(అసలు పేరు కాదు) ఆమె స్నేహితుడిపై డ్రైవర్, క్లీనర్‌లతో సహా బస్సులోని ఆరుగురు వ్యక్తులు దాడిచేసి గాయపరిచారు. నిర్భయను అత్యంత పాశవికంగా, అడవి మృగాలకంటే హీనంగా అత్యాచారం చేసి, ఆమె మర్మాంగాల పట్ల మాటల్లో వర్ణించలేనంత రాక్షసంగా ప్రవర్తించి, ఆమెను నడిరోడ్డుపై పడేసి పోయారు. నిర్భయను సింగపూర్‌కు తరలించి మెరుగైన వైద్యసేవలు అందించి బ్రతికించడానికి కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా కృషి చేసిందిగాని, ఆ ప్రయత్నాలు ఫలించలేదు. సింగపూర్ ఆసుపత్రిలోనే నిర్భయ మృతి చెందింది. ఈ సంఘటన నేపథ్యంలో దేశ వ్యాప్తంగా ఆందోళనలు జరిగాయి, కేంద్ర ప్రభుత్వం మహిళల రక్షణ కోసమంటూ ఏకంగా 'నిర్భయ' చట్టాన్నే తీసుకొచ్చింది. నిర్భయ కేసులో ఆరుగురు నిందితులపై పోలీసులు కేసులు నమోదు చేయగా, వారిలో ఒకరు మైనర్ కావడంతో మూడేళ్ల శిక్షతో బయటకొచ్చాడు. కాని నిర్భయ గ్యాంగ్ రేప్ ఘటనలో ఆమె పట్ల అత్యంత క్రూరంగా ప్రవర్తించింది ఈ మైనర్ రాక్షసుడే! అయినా ఏం లాభం... మన చట్టాలే అతనిని కాపాడాయి. అతను జైలు నుండి విడుదలయ్యాక కొన్ని రాజకీయ పార్టీలైతే ఆ మైనర్ రాక్షసుడేదో స్వాతంత్ర్య పోరాటం చేసి జైలుకెళ్లొచ్చాడన్నట్లుగా అక్కున చేర్చుకున్నాయి. నిర్భయ తల్లిదండ్రులు ఆ మైనర్ రాక్షసుడిని కూడా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేసినా 70ఏళ్ల క్రితం వ్రాసిన చట్టాల ముందు వాళ్ల డిమాండ్ నెరవేరలేదు. కాని, కొన్ని సంఘటనలలో క్రూరంగా ప్రవర్తించిన వాళ్ళు మైనర్లు అయితే ఇలా చట్టం ద్వారా బయటపడుతున్నారన్న ఉద్దేశ్యంతో అప్పటి కేంద్ర ప్రభుత్వం మైనర్ వయసు పరిధిని తగ్గిస్తూ చట్ట సవరణ తేవడం జరిగింది. నిర్భయ కేసులో మైనర్ అయిన నిందితుడు ఉరిశిక్షను తప్పించుకోగా, తీహార్ జైలులోనే రాంసింగ్ అనే నిందితుడు ఉరేసుకుని చనిపోయాడు. మిగిలిన నలుగురు నిందితులను ఉరి తీయనున్నారు. ఇటీవలే రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఓ కార్యక్రమంలో ప్రసంగిస్తూ మహిళల పట్ల క్రూరమైన నేరాలకు పాల్పడేవారిని ఎలాంటి పరిస్థితుల్లోనూ క్షమించకూడదని చెప్పారు. రాష్ట్రపతే అంత ఖచ్చితంగా చెప్పాక నిర్భయ కేసు దోషులకు ఇక ఉరి తప్పదన్నది అర్థమైపోయింది. ఆయన వద్దకు క్షమాభిక్ష ఫైల్ వెళ్లినా తిరస్కరించబడుతుందన్నది కూడా తెలిసిందే!

మాజీప్రధాని స్వర్గీయ రాజీవ్‌గాంధీ హంతకుల పట్ల ఆయన భార్య సోనియాగాంధీ ఉదారస్వభావం చూపి క్షమించిందని, ఆ స్ఫూర్తితో ఉరిశిక్ష నుండి ఈ నలుగురికీ క్షమాభిక్ష ప్రసాదించాలని నిందితుల తరపు లాయర్ చేసిన అభ్యర్థనను నిర్భయ తల్లిదండ్రులు తిరస్కరించారు. నిందితులకు మరణశిక్ష విధించడమే తమకు జరిగే న్యాయంగా వారి ఉద్దేశ్యం వుంది.

ఇక్కడ రాజీవ్ హంతకులను క్షమించడం వేరు, నిర్భయ దోషులను క్షమించడం వేరు. రాజీవ్‌ది రాజకీయ, జాతిపోరాటాల కోణంలో జరిగిన హత్య. శ్రీలంకలో ఆనాడు చోటుచేసుకొని వున్న పరిణామాల నేపథ్యంలో ఎల్‌టిటిఇ ఉగ్రవాదులు ఆయనను హతమార్చారు. రాజీవ్‌గాంధీ పట్ల వాళ్ళు ఒక శత్రుభావాన్ని పెంచుకుని వున్నారు. కాని నిర్భయ కేసు అలాంటిది కాదు. ఆ బస్సు ఎక్కేంతవరకు నిర్భయకు వాళ్ళు తెలీదు, వాళ్ళు ఆ యువతికి తెలియదు. కేవలం ఒక అమ్మాయి ఒంటరిగా దొరికిందని చెప్పి మనుషుల మన్నది మరచిపోయి ఆ క్షణాలలో మృగాలుగా మారిపోయారు. ఇలాంటి వారిని క్షమించాల్సిన అవసరం కూడా లేదు.

చట్టపరిధిలో విచారణ జరిగి నిందితులకు ఈ విధమైన కఠిన శిక్షలు విధిస్తున్నప్పుడు మన న్యాయస్థానాలు, చట్టాల పట్ల గౌరవం పెరుగుతుంది. అయితే దేశంలో జరుగుతున్న నేరాలకు విధిస్తున్న శిక్షలకు పొంతన ఉండడం లేదు. గత పదేళ్ల కాలంలోనే దేశ వ్యాప్తంగా నిర్భయ లాంటి దారుణాలెన్నో జరిగాయి. ఎన్ని కేసుల్లో నేరనిరూపణ జరిగి ఎంత మందికి శిక్షలు పడ్డాయి? విచారణలో కాలయాపన, కోర్టుల్లో సిబ్బంది కొరత, కేసు తీవ్రత తగ్గిపోయి సాక్షుల్లో ఒక రకమైన నిర్లిప్తత రావడం, బాధిత కుటుంబాలలో జరిగిందేదో జరిగిపోయిందిలే అన్న ఉదాసీనత వల్ల దారుణమైన కేసులు కూడా నీరుగారి పోతున్నాయి. దీనికంతటికీ కారణం కేసుల విచారణ, శిక్షలు అమలు చేయడంలో జాప్యం చేయడమే! అందుకే ఇలాంటి దారుణ ఘటనలు చోటు చేసుకున్నప్పుడు బాధితులు, ప్రజలు కూడా సత్వరన్యాయం కోరుకుంటున్నారు. అంటే నిందితులను ఎన్‌కౌంటర్ చేసేయమని. ఇటీవల హైదరాబాద్ 'దిశ' ఘటనలో జరిగింది కూడా ఇదే! ఈ కేసును కోర్టుల్లో తిప్పివుంటే పదేళ్లకు పైనే పట్టేది. అప్పటికి సాక్ష్యాధారాలు లేకపోతే నిందితులు తప్పించుకోవడానికి వీలుంది. ప్రజల్లో వచ్చిన ఆగ్రహాన్ని గుర్తించే ప్రభుత్వం సత్వర న్యాయం వైపు మొగ్గుచూపింది.

హైదరాబాద్‌లో 'దిశ' సంఘటన తర్వాత ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా మహిళలపై అత్యాచారం జరిగిన మూడు వారాల్లోపే కేసు నమోదు, విచారణ, శిక్ష అమలు చేసేలా చట్టం తీసుకొచ్చింది. ఇదే చట్టాన్ని తమ తమ రాష్ట్రాలలోనూ అమలు చేయడానికి ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు అధ్యయనం చేస్తున్నాయి.

ఇక్కడ ఒక్కటే మాట. నిర్భయ లాంటి దారుణాలు చోటుచేసుకున్నప్పుడు దోషులకు అది ఉరిశిక్షయినా, యావజ్జీవ కారాగార శిక్షయినా వీలైనంత త్వరగా అమలు చేసే పోలీసులకు ఎన్‌కౌంటర్‌లు చేయాల్సిన అవసరం రాదు. ఈ దిశగా న్యాయవ్యవస్థను మలిస్తే చాలు..!

### కొండబిట్రగుంట ప్రసన్న వేంకటేశ్వరుని

# బ్రహ్మోత్సవాలకు భారీ ఏర్పాట్లు

జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కొండబిట్రగుంట ప్రసన్న వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు మార్చి 4 నుంచి 10వ తేది వరకు వైభవంగా నిర్వహించాలని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌రెడ్డి చెప్పారు. ఈనెల 17న ఆలయ ప్రాంగణంలో అధికారులతో సమావేశమై బ్రహ్మోత్సవ ఏర్పాట్లను సమీక్షించారు. లక్షలాదిమంది భక్తులు స్వామివారి బ్రహ్మోత్సవాలకు తరలివస్తారు కనుక భక్తులకు భద్రత, మౌలిక సదుపాయాల కల్పనకు అధికారయంత్రాంగం పటిష్టమైన ఏర్పాట్లుచేయాలన్నారు. అన్ని శాఖల అధికారులు బ్రహ్మోత్సవాల విజయవంతానికి కృషిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ పాలకమండలి ఛైర్మెన్ శ్రీరాం మాల్యాద్రి, ఇ.ఓ మల్లికార్జునరెడ్డి, కావలి ఏఎంసి ఛైర్మెన్ నాసరరెడ్డి, పాలకమండలి సభ్యులు మోహన్, ఓబులిరెడ్డి, ప్రధాన అర్చకుడు వేదగిరి వేంకట లక్ష్మీనరసింహాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

# నేత్రపర్వం.. ఆదిలక్ష్మీదేవి అమ్మవారి వనమహోత్సవం

జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో కొలువై ఉన్న ఆదిలక్ష్మీదేవికి శ్రీ లక్ష్మీనరసింహస్వామివారి నందనవనంలో ఈనెల 17న వనమహోత్సవం నిర్వహించారు. నేత్రపర్వంగా జరిగిన ఈ వేడుకలో భాగంగా తొలుత అమ్మవారి ఆలయం వద్ద తిరుచ్చిపై పద్మపీఠం ఉంచి అందులో ఆదిలక్ష్మీదేవి ఉత్సవ విగ్రహాన్ని కొలువుదీర్చారు. వివిధ రకాలైన పుష్పాలతో, ఆభరణాలతో అమ్మవారిని శోభాయమానంగా అలంకరించారు. ఆ తర్వాత మేళతాళలు, మంగళవాయిద్యాల మధ్య వేదపండితుల వేదమంత్రోచ్చాటనల మధ్య అమ్మవారిని నందనవనంలోకి ఊరేగింపుగా తీసుకువెళ్ళి అక్కడ మండపంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎంతో వైభవంగా అమ్మవారికి ప్రాకారోత్సవం నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు, స్థానిక ప్రముఖులు ఈ వేడుకలో పాల్గొన్నారు.

### పెరసం ఆధ్వర్యంలో

# కవులకు సన్మానాలు




సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని నెల్లూరులోని పెన్నా రచయితల సంఘం(పెరసం) ఆధ్వర్యంలో ఈనెల 17న పలువురు కవులను ఘనంగా సన్మానించారు. తెలుగుభాష, సంక్రాంతి పండుగపై కవిసమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ గిరిజాలక్ష్మి, డాక్టర్ గుర్రం సీతాదేవి, పోలవరపు లక్ష్మీనరసింహారావు, మెట్టు రామచంద్రప్రసాద్, గంగిశెట్టి శివకుమార్, కిరణశ్రీ, పొట్లూరు సుబ్రహ్మణ్యం తదితరులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో పెరసం అధ్యక్ష కార్యదర్శులు మోపూరు పెంచల నరసింహం, అవ్వారు శ్రీధర్‌బాబు, పొట్లూరు హరికృష్ణ, రామ్మోహన్, సులోచన, విజేత, నల్లు రమేష్, జి.సుభద్రాదేవి, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.




# పవన్ దిగజారుడు

పవన్‌కళ్యాణ్ ఎందుకు రాజకీయాల్లోకి వచ్చాడో, ఎందుకు పార్టీ పెట్టాడో, ఎందుకు పొత్తులు మారుస్తున్నాడో ఎవరికీ అంతుబట్టడం లేదు. అతని మాటల్లోనూ స్పష్టత ఉండడం లేదు. మాట్లాడేదేమో చేగువేరా, భగత్‌సింగ్‌ల గురించి... పొత్తు పెట్టుకున్నదేమో బీజేపీతో... పార్టీ పెట్టిన కొద్దికాలంలోనే ఆరు పార్టీలతో పొత్తు పెట్టుకున్న మహా ఘటికుడు పవన్‌కళ్యాణ్. **– టి.రామకృష్ణ, జి.కొండూరు.**

# ఎందుకు అడుక్కుంటున్నట్లు?

అమరావతి రాజధాని కోసమంటూ మాజీముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జోలెపట్టి అడుక్కుంటుండడం విచిత్రంగా వుంది. ఎవరైనా ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడో, కనీసం రాజధాని నిర్మాణం కోసమో... విరాళాలు అడిగినా ఒక అర్థముంది. అమరావతి రాజధాని పోరాటసమితి రాజధాని పోరాటమంటూ అడుక్కునే స్థాయికి దిగజారడమేంటి? **– ఎ.విష్ణు, నెల్లూరు.**

# పవిత్రతను కాపాడండి

శ్రీవారి భక్తి ఛానెల్ ఛైర్మెన్‌గా వుంటూ సినీనటుడు పృధ్వీరాజ్ చేసిన నిర్వాకం చూశాం. ఫోన్ సంభాషణల్లో ఆయన బండారం బయటపడింది. ఆధ్యాత్మిక సంస్థలకు సంబంధించిన పదవులను దానికి తగినవారికే ఇవ్వాలి. ఆ పదవులకు గౌరవం పెంచేవారే ఉండాలి. రాజకీయాలలో రొచ్చు భాష మాట్లాడేవాళ్ళను తెచ్చి ఇలాంటి పదవుల్లో కూర్చోబెడితే ఇట్లాంటి వెకిలి చేష్టలే చేస్తుంటారు. **పోతన సుబ్బారావు, తెనాలి.**

# ఎన్నికలా? ఏకగ్రీవాలా?

## బ్యాలెట్ యుద్ధానికి 'దేశం' సన్నద్ధమేనా?




**సార్వత్రిక ఎన్నికల షాక్ నుండి తెలుగుదేశం పార్టీ ఇంకా తెప్పరిల్లలేదు. నిన్న పార్టీకి తగిలింది అట్లాంటి ఇట్లాంటి షాక్ కాదు... 35ఏళ్ల చరిత్రలో ఎప్పుడూ తగలని షాక్. దాని నుండి తేరుకోక ముందే స్థానిక ఎన్నికలొచ్చిపడ్డాయి. వాస్తవంగా అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వచ్చిన పక్కనెల్లోనే స్థానిక ఎన్నికలను కూడా పెట్టేసి వుంటే అసలు తెలుగుదేశంకు పోటీ చేయాల్సిన అవసరమే వుండేది కాదు. ఆ గాలిలో పోటీ చేయడానికి కూడా ఎవరూ ముందుకొచ్చే వాళ్ళు కాదు.**

ఇప్పుడు తెలుగుదేశం శ్రేణులు సందిగ్ధ స్థితిలో వున్నాయి. ముఖ్యంగా తెలుగుదేశం తరపున అభ్యర్థులను నిలబెట్టడం కష్టసాధ్యమైన పనే కావచ్చు. జడ్పీటీసీ ఎలక్షన్ అన్నా కూడా ఖర్చు 50లక్షల పైమాటే! ఎన్నికలు ఎలాంటివి అయినా ఖర్చు కామన్ అయ్యింది. ఓట్లకు నోట్లు పంపిణీ కూడా మామూలే!

జడ్పీటీసీ, ఎంపీటీసీలుగా వైసిపి తరపున పోటీ చేయడానికి అభ్యర్థులు దండిగా ముందుకొస్తారు. వైసిపి అధికారంలో వుంది. అది కూడా అసెంబ్లీ ఎన్నికల గెలుపు వూపుమీదుంది. గ్రామ సీమలలో సంక్షేమ పథకాల జాతర జరుగుతోంది. దండిగా వర్షాలు పడి రైతాంగం సంతోషంగా వుంది. పరిస్థితులన్నీ అధికారపార్టీకి సానుకూలంగా వున్న తరుణంలో ఆ పార్టీ టిక్కెట్ దొరికితే గెలిచిపోయినట్లే అన్నంత వాతావరణం వుంది. కాని, తెలుగుదేశంలో పరిస్థితి అలా కాదు. జిల్లాలో వున్న 46 జడ్పీటీసీ స్థానాలకు పూర్తి స్థాయిలో అభ్యర్థులను నిలబెట్టడానికే ఆ పార్టీ వాళ్ళు ఆపసోపాలు పడాల్సి రావచ్చు. అదీగాక డబ్బు ఖర్చుపెట్టుకోవాలంటే ఎవరూ ముందుకురారు. ఓడిపోతామనే భయంతో కొందరు రారు. కాబట్టి జిల్లాలోని 46 జడ్పీటీసీలకు, 500 పైచిలుకు ఎంపీటీసీలకు అభ్యర్థులను వెదకడం తెలుగుదేశం వాళ్ళకు పెద్దపనే!

# ఆరోగ్యంగా సోమిరెడ్డి



మాజీమంత్రి, తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పూర్తిగా కోలుకున్నాడు. పండుగరోజుల్లో ఆయన ఛాతిలో నొప్పితో అస్వస్థతకు గురికాగా, వెంటనే నెల్లూరు లోని అపోలో ఆసుపత్రికి తరలించారు. ప్రముఖ గుండె వ్యాధి వైద్యనిపుణులు డాక్టర్ భక్తవత్సలరెడ్డి ఆయనకు వైద్యపరీక్షలు నిర్వహించి గుండెకు రక్తం సరఫరా చేసే నాళాల్లో రెండు బ్లాక్స్ వున్నట్లు గుర్తించారు. అపోలో వైద్యుల సూచన మేరకు సోమిరెడ్డి హైదరాబాద్‌లోని అపోలో ఆసుపత్రిలో చేరగా రెండు స్టంట్‌లు వేశారు. ఆసుపత్రి నుండి డిశ్చార్జ్ అయ్యి హైదరాబాద్‌లోని తన ఇంటిలో విశ్రాంతి తీసుకుంటున్న సోమిరెడ్డిని వివిధ పార్టీల నాయకులు, ప్రముఖులు, జిల్లా నుండి ఆయన అనుచరులు, అభిమానులు పెద్దఎత్తున వెళ్లి పరామర్శిస్తున్నారు.

# బుచ్చికే పచ్చజెండా!

జిల్లాలో 9 మేజర్ పంచాయితీలను గ్రేడ్-4 నగర పంచాయితీలుగా మార్చాలనే ప్రతిపాదనలను జిల్లా అధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి పంపినప్పటికీ రాబోయే స్థానిక ఎన్నికలలోపు ఒక్క బుచ్చిరెడ్డి పాళెంను మాత్రమే నగర పంచాయితీగా మార్పు చేయడానికి ప్రభుత్వం ఆమోదం తెలిపినట్లు తెలుస్తోంది. జిల్లాలో తొలుత బుచ్చి, ఉదయగిరి, వింజమూరు, అల్లూరు, కోవూరు, పొదలకూరు, రాపూరు, కోట, ముత్తుకూరు, తడలను గ్రేడ్-4 మున్సిపాల్టీల పరిధిలోకే తేవాలనుకున్నారు. అయితే వాటిలో ప్రతిపాదనలలో బుచ్చి, వింజమూరు, కోట, అల్లూరు మాత్రమే నిలిచాయి. అయితే ఎన్నికలు దగ్గరకొచ్చే సరికి బుచ్చి ఒక్కదానినే నగర పంచాయితీగా మార్చడానికి ప్రభుత్వం పచ్చ జెండా ఊపిందని సమాచారం.

కొత్తగా 11 పంచాయితీలను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ప్రకటించింది. బుచ్చిరెడ్డి పాళెంను నగర పంచాయితీగా ఏర్పాటు చేస్తూ సర్క్యులర్ జారీ అయింది. బుచ్చిలో వవ్వేరు పంచాయితీ, కట్టుబడిపాళెం పంచాయితీలతో పాటు ఇస్కపాళెం పార్ట్‌ను విలీనం చేశారు. కావలి మునిసిపాలిటీలో చౌదరిపాళెంను, గూడూరు మునిసిపాలిటీలో చిల్లకూరు, పోటుపాళెం, దివిపాళెం, నెల్లటూరు, చెన్నూరు పంచాయితీలను నాయుడుపేట మునిసిపాలిటీలో జువ్వలపాళెం, విన్నమాల పార్ట్, తిమ్మాజి కండ్రిగ పార్ట్, బిరదవాడ పార్ట్, సూళ్ళూరుపేట మునిసిపాలిటీలో ఇల్లుపూరు పార్ట్, కేసీఎన్ గుంట పార్ట్ లను కలిపారు. విలీనం అయిన పంచాయితీల్లో ఎన్నికలు నిర్వహించొద్దని ప్రభుత్వం నుంచి డీపీఓ కార్యాలయానికి ఆదేశాయి అందాయి.

### నూతన పంచాయితీలు

నెల్లూరు జిల్లా విడవలూరు మండలంలో పెద్దపాళెం, కొడవలూరు మండలంలో పద్మనాభసత్రం, పాతవంగల్లు, పెమ్మారెడ్డిపాళెం, నాయుడుపేట మండలంలో న్యూ వేముగుంటపాళెం(వేముగుంట పాళెం, మడపళని, కాలువ గట్టు గ్రామాలు కలిపి), చేజర్ల మండలంలో పెల్లేరు పంచాయితీలను ఏర్పాటు చేశారు. గతంలో చేజర్ల మండలంలో బిల్లుపాడు, పుట్టుపల్లి, మైపాటివారికండ్రిగ, వెంకటాచల మండలంలో సరస్వతీనగర్ (ఎర్రగుంట), అనంతసాగరం మండలంలో కొత్తపల్లి పంచాయితీలను ఏర్పాటు చేశారు. మొత్తం కలిపి 11 పంచాయితీలు ఏర్పాటు అయ్యాయి. జిల్లాలో ఇప్పటికే 940 పంచాయతీలున్నాయి. ఈ 11నూతన పంచాయితీలతో కలిపి 951 పంచాయితీలు ఏర్పాటుకావాలి, కాని ఈ మొత్తంలో 10 పంచాయితీలు, మరికొన్ని మజరా గ్రామాలు మునిసిపాలిటీల్లో కలిపారు. దీంతో మునిసిపాలిటీల్లో కలిపిన గ్రామాల్లో ఎన్నికలు జరపరాదని ఆదేశాలందాయి. మార్పులు, చేర్పులు జరిగాక మొత్తం మీద 941 పంచాయితీలు జిల్లాలో ఏర్పడ్డాయి.

# నాన్నగారి స్ఫూర్తితో... అపారకీర్తి సాధిస్తున్న సేవా 'దీప'ం



- **దీపమ్మకు 'చాంపియన్స్ ఛేంజ్'-2019 అవార్డు**
- **మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ చేతుల మీదుగా ప్రదానం**




***స్వర్ణభారత్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ శ్రీమతి దీపా వెంకట్‌కు ఎంతో విశిష్టమైన 'చాంపియన్స్ ఛేంజ్-2019' అవార్డు లభించింది, మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ చేతుల మీదుగా ఆమె ఈ ప్రతిష్టాత్మక అవార్డును అందుకున్నారు. స్వర్ణభారత్ ట్రస్ట్ ద్వారా గ్రామీణ ప్రాంతాల మహిళలు, యువత అభ్యున్నతి కోసం ఆమె చేస్తున్న నిరంతర కృషికి, సామాజిక సేవకు గాను ఆమెకు ఈ అవార్డు లభించింది. ఈనెల 20వ తేది మధ్యాహ్నం ఢిల్లీలోని మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ నివాసంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో దీపావెంకట్‌కు ఈ అవార్డును అందజేశారు.***

### తండ్రి స్ఫూర్తితో సేవా రంగంలోకి :

భారత ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు కుమార్తె అయిన శ్రీమతి దీపా వెంకట్ తన భర్తతో కలసి వ్యాపారరంగంలో విజయాలు సాధించడంతో పాటు నాన్న గారి స్ఫూర్తితో స్వర్ణభారత్ ట్రస్ట్‌ను స్థాపించి సామాజిక సేవా రంగంలో ఉంటూ ఎన్నో విశిష్టమైన అవార్డులు అందుకున్నారు. దీపా వెంకట్ నిస్వార్ధ సేవకు గుర్తింపుగా ఈ అవార్డు లభించింది. శ్రీమతి దీపా వెంకట్‌తో పాటు జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్, ఢిల్లీ ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియా, కేంద్ర ఆర్థిక కార్పొరేట్ వ్యవహారాల సహాయమంత్రి అనురాగ్ ఠాకూర్ తదితరులు ఈ అవార్డులను అందుకున్న వారిలో ఉన్నారు.

### ఎంతో విశిష్టమైన అవార్డు :

భారత ప్రభుత్వ గుర్తింపు పొందిన 'ఇంటరాక్టివ్ ఫోరమ్ ఆన్ ఇండియన్ ఎకానమీ' సంస్థ గత ఏడాది నుంచి వివిధ రంగాల్లో కృషిచేసిన వారికి ఈ అవార్డును అందిస్తోంది. సర్దార్ పటేల్ గారి 'ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్' స్ఫూర్తితో ఈ అవార్డును సామాజిక సేవ, సంస్కృతి, విద్య, ఆరోగ్యం, స్వచ్ఛభారత్ తదితర రంగాలతో పాటు ప్రత్యేకించి జిల్లాల్లో జాతీయసమైక్యత కోసం కృషి చేసిన వారికి అందిస్తారు. భారత మాజీ చీఫ్ జస్టిస్, జాతీయ హ్యూమన్‌రైట్స్ కమిషన్ మాజీ ఛైర్మెన్ కెజి బాలకృష్ణన్ నేతృత్వంలోని కమిటీ ఈ అవార్డుకు జ్యూరీగా వ్యవహరిస్తుంది.

### 'స్వర్ణభారత్' ద్వారా.. పేదల జీవితాల్లో వెలుగులు :

గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్న రైతులు, మహిళలు, యువత జీవితాల్లో అర్ధవంతమైన, గణనీయమైన మార్పులు తీసుకువచ్చి వారి అభ్యున్నతికి బాటలు వేయాలన్న సంకల్పంతో 2001లో జిల్లాలోని వెంకటాచలంలో స్వర్ణభారత్ ట్రస్ట్‌ను ప్రారంభించారు. సమాజ అభివృద్ధిలో భాగం పంచుకుంటూ, సమాజానికి సేవలందించాలనే మన భారతీయ సంప్రదాయ విలువలను నిరంతరం విశ్వసించే ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు ఈ ట్రస్ట్‌కు స్ఫూర్తిప్రదాతగా నిత్యచైతన్యాన్ని అందిస్తున్నారు. వారి కుమార్తె దీపా వెంకట్ ఈ ట్రస్ట్‌కు మేనేజింగ్ ట్రస్టీగా వ్యవహరిస్తున్నారు. మహాత్మాగాంధీ, పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ ప్రేరణ, చిత్రకూట్‌లో నానాజీ దేశ్‌ముఖ్ అమలుచేసిన గ్రామస్వరాజ్య సాధన ప్రభావంతో ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు తన మిత్రులకు ఈ ట్రస్ట్‌ను ఏర్పరచి గ్రామీణ పేదలకు సాధికారత కల్పించడమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. అప్పటి ఉప ప్రధాని ఎల్‌కె అద్వానీ దీనిని ప్రారంభించారు. గత 19 ఏళ్ళుగా స్వర్ణభారత్ ట్రస్ట్ ప్రజల జీవితాలను, ప్రధానంగా అణగారిన వర్గాల ప్రజల జీవితాల్లో వెలుగుబాటలు పరుస్తూ ఉంది. పేదవర్గాల పిల్లలకు నాణ్యతతో కూడిన విద్యను అందించడం, నిరుద్యోగులకు ఉపాధిని పొందగల నైపుణ్యాల పట్ల శిక్షణ ఇవ్వడం, నిరాశ్రయులైన పెద్దలకు ఆశ్రయం కల్పించడం, నిపుణులు, శాస్త్రవేత్తల ద్వారా శిక్షణా సదస్సుల్లో రైతులకు ఆధునిక పరిజ్ఞానం, వ్యవసాయపద్ధతుల పట్ల అవగాహన కల్పించడం, పేదలకు ఉచిత వైద్యసేవలు అందించడం తదితర సేవా కార్యక్రమాలను స్వర్ణభారత్ ట్రస్ట్ నిర్వహిస్తోంది. రాష్ట్రపతి శ్రీ రామ్‌నాథ్ కోవింద్, అప్పట్లో గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న నేటి ప్రధాని నరేంద్రమోడీతో పాటు ఎంతోమంది మంత్రులు, ప్రముఖులు, సుప్రీంకోర్టు, హైకోర్టుల న్యాయమూర్తులు, మరెందరో ఆధ్యాత్మిక గురువులు, శాస్త్రవేత్తలు స్వర్ణభారత్ ట్రస్ట్‌ను సందర్శించి ట్రస్ట్ సేవా కార్యక్రమాలను ప్రశంసించి ఉన్నారు కూడా. ఏదేమైనా సేవారంగంలో జాతీయస్థాయిలో ఎంతో విశిష్టమైన అవార్డునందుకున్న దీపమ్మకు 'లాయర్' శుభాకాంక్షలు.



# నెల్లూరు కబుర్లు

## ముగిసిన సందడి

### ఊపిరి పీల్చుకున్న పోలీస్

భారత ఉపరాష్ట్రపతి యం.వెంకయ్యనాయుడు నాలుగురోజుల జిల్లా పర్యటన ముగియడంతో జిల్లా అధికార యంత్రాంగం ఊపిరి పీల్చుకుంది. ఉప రాష్ట్రపతితో పాటు 21వ తేదీన కేంద్రమంత్రి రమేష్ పొఖ్రియాల్, విఎస్‌యు స్నాతకోత్సవం కోసం గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్‌లు జిల్లాకు రావడం తెలిసిందే! విఐపిల భద్రత నేపథ్యంలో భారీగా పోలీసులను మోహరించారు. విఐపిల కాన్వాయ్ రాకపోకల సందర్భంగా పలుసార్లు నగరంలో భారీగా ట్రాఫిక్‌జామ్ ఏర్పడింది. పోలీసులు ఎటువంటి లోపాలు లేకుండా పకడ్బందీగా బందో బస్తు నిర్వహించారు. విఐపిల పర్యటన ప్రశాంతంగా ముగియడంతో అధికారులు, పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.

## బ్యాలెట్ ప్రింటింగ్ ఆగింది

స్థానిక సంస్థల ఎన్నికలపై సుప్రీం కోర్టు స్టే విధించిన నేపథ్యంలో ఆయా ప్రింటింగ్ ప్రెస్‌లలో మొదలుపెట్టిన బ్యాలెట్ పేపర్ ప్రింటింగ్‌ను అర్థాం తరంగా ఆపారు. రాష్ట్ర పంచాయితీరాజ్ ఉన్నతాధి కారుల ఆదేశాలతోనే ఈ ప్రింటింగ్ ఆపినట్లు తెలు స్తోంది. ఎన్నికలపై స్పష్టత వస్తేనేగాని మళ్ళీ ప్రింటింగ్ మొదలుపెట్టరు.

## ఫిబ్రవరి 3 వరకు ఆందోళనలు

హైకోర్టును కర్నూలుకు మార్చాలన్న ప్రతిపాదనకు నిరసనగా నెల్లూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు చేస్తున్న విధుల బహిష్కరణ కార్య క్రమం ఫిబ్రవరి 3వ తేదీ వరకు జరుగుతుందని బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు డి.ఫణిరత్నం, ఆర్.రోజారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఆందో ళనలకు న్యాయమూర్తులు, న్యాయవాదులు సహక రించాలని వారు కోరారు.

### వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 203

## అధ్యక్షుడిగా రాఘవేంద్ర శెట్టి




వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 203 కొత్త కమిటి ప్రమాణస్వీకారోత్సవం 20వ తేదీ నెల్లూరులోని స్వర్ణ వేదిక కళ్యాణ మండపం నందు జరిగింది. జిల్లా గవర్నర్‌గా ఎస్.రాఘవేంద్రశెట్టి, పాస్ట్ జిల్లా గవర్నర్‌గా ఎస్.కె.లాల్‌వజీర్, జిల్లా గవర్నర్(ఎలక్ట్)గా వై.రాఘవరెడ్డి, జిల్లా క్యాబినెట్ సెక్రటరీగా నలుబోలు బలరామయ్యనాయుడు, క్యాబినెట్ కోశాధికారిగా ఆర్.ఏ.రమేష్‌బాబు, జాయింట్ సెక్రటరీగా ఎస్.రమేష్ బాబు, బులెటిన్ ఎడిటర్‌గా ఏ.బి.రాజగోపాల్, కో-ఎడిటర్‌గా కె.ఆర్.సుధాకర్‌రాజు, డిప్యూటీ గవ ర్నర్స్‌గా ఎస్.మురళీమోహన్‌రావు, ఎం.సుధాకర్‌రెడ్డి, సిహెచ్ ఈశ్వర్‌రెడ్డి, ఎన్.నాగరాజు, కె.సత్యనారా యణలు ప్రమాణస్వీకారం చేశారు. కమిటీ అధ్యక్షుడు ఏబి కుప్పరం అందరి చేత ప్రమాణస్వీకారం చేయం చారు. మాజీఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, మాజీ రోటరీగవర్నర్ దొడ్ల భరత్‌కుమార్‌రెడ్డి, ఎం.వి. సుబ్బారెడ్డి, ఎస్.కె.వజీర్ తదితరులు ఈ కార్యక్రమానికి అతిథులుగా హాజరయ్యారు.

## తెరచుకున్న బళ్ళు

సంక్రాంతి సెలవుల అనంతరం ఈ నెల 21వ తేదీ నుండి బళ్లు తెరుచుకున్నాయి. కాలేజీలను 20వ తేదీ నుండే తెరువగా పాఠశాలలను మాత్రం 21 నుండి తెరిచారు. సొంతూర్లలో సంక్రాంతి పండుగను బాగా ఎంజాయ్ చేసిన విద్యార్థులు ఇక పుస్తకాల కుస్తీకి సిద్ధమయ్యారు.

### జేఈఈ మెయిన్స్‌లో

## విశ్వసాయి విజయాలు



జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో విశ్వసాయి జూని యర్ కళాశాల విద్యార్థులు విశిష్ట విజయాలు సాధించారని విద్యాసంస్థల ఛైర్మన్ సత్యనారాయణ తెలిపారు. జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను నెల్లూరు మాగుంటలేఅవుట్ లోని విశ్వసాయి జూనియర్ కళాశాలలో అభినం దించిన అనంతరం ఆయన మాట్లాడుతూ జాతీయ స్థాయిలో ఎం.వెంకటదినేష్ 98.71 పర్సంటైల్‌తో, 12 మంది విద్యార్థులు 90 కంటే ఎక్కువ పర్సం టైల్‌తో, 53 మంది 80 కంటే ఎక్కువ పర్సంటైల్‌తో ప్రతిభను కనబరిచారన్నారు. విశ్వసాయి జూనియర్ కళాశాల ప్రిన్సిపల్స్, అధ్యాపకులు పాల్గొన్నారు.

### సిటిఎస్‌కు ఎంపికైన

## కృష్ణచైతన్య విద్యార్థులు



నెల్లూరులోని కృష్ణచైతన్య డిగ్రీ కళాశాలకు చెందిన 32మంది విద్యార్థులు సిటిఎస్‌కు ఎంపి కయ్యారు. తిరుపతిలో జరిగిన క్యాంపస్ ఎంపికలకు బిఎస్సీ, బికాం తృతీయ సంవత్సరం విద్యార్థులు 500మంది హాజరయ్యారు. వీరిలో 36మందిని సిటిఎస్‌కు ఎంపిక చేయగా వారిలో 32మంది కృష్ణచైతన్య విద్యార్థులు కావడం గమనార్హం. కళాశాల డైరెక్టర్లు పి.చంద్రశేఖర్‌రెడ్డి, కృష్ణారెడ్డిలు విద్యార్థులను అభినందించారు.

### మార్కెటింగ్ కార్యాలయాన్ని

## సందర్శించిన జేసీ

ధాన్యం నాణ్యత, తేమ శాతాన్ని కొలిచే పరిక రాలను మార్కెటింగ్ శాఖాధికారులు సిద్ధంగా వుంచు కోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ పి.వినోద్‌కుమార్ ఆదేశించారు. 21వ తేదీన ఆయన నగరంలోని మద్రాసుబస్టాండ్ వద్ద గల నెల్లూరు వ్యవసాయ మార్కెటింగ్ శాఖ కార్యాలయాన్ని సందర్శించారు. ధాన్యం నాణ్యత తేమ శాతాన్ని కొలిచే పరికరాలను పరిశీలించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు అవసరమైన పరికరాలను అందజేసేందుకు సిద్ధంగా వుండాలన్నారు. జేసీకి మార్కెటింగ్ కమిటీ ఛైర్మెన్ ఏసునాయుడు స్వాగతం పలికి సత్కరించారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ కమిటి కార్యదర్శి రామాంజనేయులు, ఏ.డి రామమ్మ, డిఎస్ఓ బాలకృష్ణరావు, ఏఎం మూర్తి పాల్గొన్నారు.

### ఆదాలను సత్కరించిన

## వీవర్స్ ఎంప్లాయిస్



ఆంధ్రప్రదేశ్ వీవర్స్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసి యేషన్ సభ్యులు 21వ తేదీ నెల్లూరు లోక్‌సభ సభ్యులు ఆదాల ప్రభాకర్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిసి తమ సమస్యలను ఆయన దృష్టికి తెచ్చారు. శాలువాతో ఆదాలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసి యేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటశేషయ్య, జిల్లా అధ్యక్షుడు ఎస్.వెంకటసురేష్, సభ్యులు పాల్గొన్నారు.

## అభివృద్ధిపనులకు నిధులొచ్చాయి

**- నాబార్డ్ డిడి ఎం.రవి**

జిల్లాలో విద్య, వైద్య తదితర సంక్షేమ రంగాలకు సంబంధించి పలు అభివృద్ధిపనులకు నాబార్డ్ ద్వారా నిధులు విడుదలయ్యాయని నాబార్డ్ డిప్యూటీ డైరెక్టర్ ఎం.రవి పేర్కొన్నారు. ఆ మేరకు జిల్లాలో 53 రకాల పనులకు గాను 71.21 కోట్ల రూపాయలు విడుద లయ్యాయని, వైద్యశాఖలో రెండు ఏరియా ఆసుపత్రు లకు 29.83 కోట్లు, సర్వశిక్ష అభియాన్ ద్వారా 39 పాఠశాలలకు 28.77 కోట్లు, సాంఘిక సంక్షేమ శాఖలో పలు పనులకు మొత్తం 7.09కోట్లు, బీసీ సంక్షేమశాఖలో రెండు పనులకు 5.52కోట్ల రూపా యల వంతున విడుదల చేశామని వివరించారు.

## రెడ్‌క్రాస్ ఎన్నికలు

### ● విడుదలైన నోటిఫికేషన్

ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటి నెల్లూరుజిల్లా బ్రాంచ్ ఎన్నికలకు జిల్లా కలెక్టర్ శేషగిరిబాబు ఈనెల 20 న షెడ్యూలు విడుదల చేశారు. ఎన్నికల నిర్వహణ బాధ్యతను డీసీఓ తిరుపాల్‌రెడ్డికి అప్పగించారు. నెల్లూరు బ్రాంచ్‌లో 8మంది, కావలిలో ముగ్గురు, ఆత్మకూరులో ఒకరు, మల్లాం, సూళ్ళూరుపేట బ్రాంచ్ లకు ఒకరు, కలువాయి, మర్రిపాడు బ్రాంచ్‌లకు ఒకరు, వెంకటగిరి బ్రాంచ్‌కి ఒకరిని కలిపి మొత్తం 15 మంది సభ్యులను ఎన్నుకోవాల్సి వుంది. ఈనెల 25 న నామినేషన్లు నెల్లూరు రెడ్ క్రాస్ ఆవరణంలో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు స్వీకరిస్తారు. నామినేషన్ ఫీజు రూ.1000లు చెల్లించాలి. 26న నామినేషన్ల పరిశీలన జరుగు తుంది. అదేరోజు చెల్లుబాటైన నామినేషన్లు ప్రకటి స్తారు. 27న ఉపసంహరణకు అవకాశం ఉంటుంది. ఫిబ్రవరి 2న ఎన్నికలు కావలి మినహా మిగతా అన్ని బ్రాంచ్‌లకు నెల్లూరులోని రెడ్‌క్రాస్ ఆవరణంలో ఉదయం నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వ హిస్తారు. కావలి బ్రాంచ్‌కు కావలి పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం ఆవరణంలో ఉదయం నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు నిర్వహిస్తారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి ఓట్ల లెక్కింపు కార్య క్రమం జరుగుతుంది. ఛైర్మన్, వైస్ ఛైర్మన్, ట్రెజరర్ పదవులకు ఎన్నికలు జరుగుతాయి.

### పినాకిని ఆశ్రమానికి

## 10లక్షల విరాళం

ఇందుకూరుపేట మండలం పల్లిపాడులోని పినాకిని సత్యాగ్రహ ఆశ్రమానికి గణేశం కృష్ణారెడ్డి 10లక్షల రూపాయల విరాళం అందించారు. ఇటీవల జిల్లా కలెక్టర్ ఎం.వి.శేషగిరిబాబుకు వారు ఆ విరాళం అందజేశారు.

## కుంభాభిషేకానికి ఏర్పాట్లు

నెల్లూరు మూలాపేటలోని శ్రీ భువనేశ్వరీ సమేత మూలస్థానేశ్వరస్వామి దేవస్థానంలో ఈ నెల 24 నుండి 27వతేదీ వరకు నిర్వహించే మహాకుంభాభి షేకానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

మహా కుంభాభిషేక ఆహ్వాన పత్రికను ఈ నెల 20న దేవస్థానంలో ఛైర్మెన్ లోకిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, ఇ.ఓ ఆరంబాకం వేణుగోపాల్‌లు ఆవిష్కరించారు. 24వతేదీ శుక్రవారం మహాకుంభాభిషేకాలు మొద లవుతాయి. ప్రతిరోజూ 50 మంది కంచి నుండి ప్రత్యేకంగా విచ్చేసిన వేదపండితులు మహాకుంభా భిషేకాలను నిర్వహిస్తారు. 27వ తేదీ రాజగోపురం, విమాన గోపురం, పరివార దేవతలకు కుంభాభిషేకం, భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి మహా కుంభాభిషేకం, మూలవర్లకు మహాభిషేకం, రాత్రికి స్వామివార్ల కళ్యాణం, తిరువీధి ఉత్సవాలతో మహా కుంభాభిషేకం ముగుస్తుంది.

### నవాబుపేట శివాలయం

## బాధ్యతలు చేపట్టిన కొత్త పాలకవర్గం

నెల్లూరు నవాబుపేటలోని శ్రీ భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవస్థానాన్ని రెండేళ్ళలో అభివృద్ధి చేస్తామని రాష్ట్ర జలవనరులశాఖామంత్రి పి.అనిల్ కుమార్ యాదవ్ తెలిపారు. ఈనెల 17న ధర్మకర్తల మండలి సభ్యుల ప్రమాణ స్వీకారానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ భ్రమరాంబ, మల్లే శ్వరస్వామి దేవస్థానం అభివృద్ధికి రూ.1.5 కోట్లతో అంచనాలు రూపొందించారని, వీటిని మంజూరు చేయించి దేవస్థానాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. సీఎం జగన్మోహన్ రెడ్డి తీసుకున్న నిర్ణయాలతో ప్రతి కమిటీ, పాలకమండళ్ళలో మహిళలకు 50 శాతం రిజర్వేషన్ అవకాశాన్ని కల్పించామని వివరించారు. అనంతరం ధర్మకర్తల మండలి ఛైర్మన్‌గా వంగాల శ్రీనివాసులు రెడ్డి, సభ్యులుగా మీనం వెంకటేశ్వర్లు, కాకి లీలారాణి, చంద్రశేఖరయ్య, సానిశెట్టి సంధ్యాలక్ష్మీ, జ్యోతి ప్రియ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో ఇఒ నవీన్‌కుమార్ , వైయస్సార్ సీపీ నాయకులు ముక్కాల ద్వారకానాథ్, కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, దామవరపు రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

### ఇరుకళల పరమేశ్వరి ఆలయం

## కొత్త పాలకవర్గం

నెల్లూరు గ్రామ దేవత ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంకు నూతన పాలక మండలిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పాలకమండలి ఛైర్మెన్‌గా ఒట్టూరు సురేంద్ర, సభ్య లుగా యారంరెడ్డి కుమార్, కూరపాటి వెంకయ్య, ఎండ్లూరి భాస్కర్, కుమార్ దేవి, కల్లూరి శైలజలను నియమించారు. తమను ఈ పదవులకు ఎంపిక చేసినందుకు మంత్రి అనిల్‌కుమార్‌యాదవ్‌కు, రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

### 9 లక్షలకు పైగానే..

## రంగనాథస్వామి హుండీ ఆదాయం

నెల్లూరులోని రంగనాయకులపేటలో కొలువై ఉన్న శ్రీ తల్పగిరి రంగనాథస్వామి ఆలయంలో ఇటీవల వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఏర్పాటుచేసిన తాత్కాలిక హుండీల ద్వారా భక్తులు కానుకల రూపంలో స్వామివారికి 2.05 లక్షలు సమర్పిం చారని, టికెట్ల విక్రయం ద్వారా 7,68,318 రూపా యల ఆదాయం వచ్చిందని ఆలయ ఇ.ఓ వేమూరి గోపి తెలియజేశారు. గతనెల 5వ తేది నుంచి ఈ నెల 17వ తేదీ వరకు దేవస్థానంలో ఏర్పాటుచేసిన తాత్కాలిక హుండీ కానుకలను లెక్కించామన్నారు. ఈ లెక్కింపులో ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మెన్ కోట గురుబ్రహ్మం, దేవాదాయశాఖ నెల్లూరు డివిజన్ ఇన్‌స్పెక్టర్ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

# ఆలయాల అభివృద్ధిపై దృష్టిపెట్టండి

## మూలస్థానేశ్వరస్వామి దేవస్థాన పాలకమండలి ప్రమాణస్వీకారోత్సవ సభలో మంత్రి అనిల్



నెల్లూరు నగరంలోని అన్ని దేవస్థానాలకు త్వరలోనే ధర్మకర్తల మండళ్ళను ఏర్పాటుచేయనున్నామని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డా. పి.అనిల్‌కుమార్ యాదవ్ అన్నారు. ఇటీవల నెల్లూరు మూలాపేటలో ఉన్న భువనేశ్వరి సమేత



ప్రమాణస్వీకారం చేస్తున్న మూలస్థానేశ్వరస్వామి ఆలయ పాలకమండలి సభ్యులు

శ్రీ మూలస్థానేశ్వరస్వామి ఆలయంలో ఆలయ పాలకమండలి ప్రమాణస్వీకారం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి అనిల్ మాట్లాడుతూ నెల్లూరు పరిధిలోని అన్ని ఆలయాలను దశల వారీగా అభివృద్ధి చేయనున్నామన్నారు. మూలస్థానేశ్వరస్వామి ఆలయ పాలక మండలి ఛైర్మెన్‌గా లోకిరెడ్డి వెంకటేశ్వర్లు రెడ్డిని నియమించామని అంటూ, గతంలో కూడా ఎందరో ప్రముఖులు ఈ ఆలయానికి ఛైర్మెన్లుగా, సభ్యులుగా సేవలందించారని కొనియాడారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి అర్చకుల జీత భత్యాలను పెంచారని అంటూ, కొన్ని దేవస్థానాలకు కోట్లాదిరూపాయల ఆస్తులున్నా అర్చకులకు జీతాలు చెల్లించలేకపోతున్నారన్నారు. ఆయా ఆలయాలకు సంబంధించిన అర్చకులకు జీతభత్యాలు సక్రమంగా వచ్చేలా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పాల్గొని నూతన పాలకమండలికి శుభాకాంక్షలు తెలియజేశారు. వైయస్సార్సీపి జిల్లా అధ్యక్షుడు పోలుబోయిన రూప్‌కుమార్‌యాదవ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆలయ పాలకమండలి ఛైర్మెన్‌గా లోకిరెడ్డి వెంకటేశ్వర్లురెడ్డి, సభ్యులుగా రాజేశ్వరమ్మ, గంగాధర్, మల్లికార్జునరెడ్డి, విష్ణుప్రియ, బ్రహ్మానందం, గీత, పూర్ణచంద్రరావు, వెంకటరమణమ్మ, శివకుమార్ ప్రమాణస్వీకారం చేశారు. ఆలయ ఇ.ఓ ఆరంబాకం వేణుగోపాల్, వైకాపా నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, మాజీ డిప్యూటి మేయర్ ముక్కాల ద్వారకానాథ్, రామిరెడ్డి, ఏసునాయుడు, గోగుల నాగరాజు, చాట్ల నరసింహారావు, జనార్ధన్‌రావు, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

## వైసిపి ముద్దంటే... టీడీపీ వద్దంటే...

# 'రాజధాని'పై ఇరుపార్టీల ప్రదర్శనలు







మూడు రాజధానుల బిల్లు సోమవారం శాసనసభలో ఆమోదం పొందిన నేపథ్యంలో నెల్లూరుజిల్లాలో భిన్న స్పందనలు కనిపించాయి. అభివృద్ధి వికేంద్రీకరణకు ముందడుగు పడడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ వైసిపి శ్రేణులు జిల్లా వ్యాప్తంగా బాణాసంచా కాల్చి విజయోత్సవాలు నిర్వహించాయి. నెల్లూరు నగర నియోజకవర్గ పరిధిలో రాజన్నభవన్ వద్ద స్వీట్లు పంచి బాణాసంచా కాల్చారు. భారీఎత్తున ర్యాలీ నిర్వహించారు. నెల్లూరురూరల్ వైసిపి కార్యాలయం వద్ద సంబరాలు జరుపుకున్నారు. మూడు రాజధానులకు మద్దతుగా నెల్లూరులో విద్యార్థినులు భారీ ర్యాలీ నిర్వహించారు. కోవూరు, సర్వేపల్లి, కావలి, వెంకటగిరి, ఆత్మకూరు, ఉదయగిరి, గూడూరు నియోజకవర్గాలలోనూ వైసిపి కార్యకర్తలు మూడు రాజధానులకు మద్దతుగా ర్యాలీలు నిర్వహించారు.

ఇంకోపక్క మూడు రాజధానులను నిరసిస్తూ, అమరావతి రైతులకు మద్దతుగా తెలుగుదేశంపార్టీ శ్రేణులు ఆందోళనలకు దిగాయి. ఏపి రాజధానిగా అమరావతినే కొనసాగించాలంటూ తెలుగుదేశం పార్టీ అధిష్టానం ఇచ్చిన పిలుపు మేరకు సోమవారం అసెంబ్లీ ముట్టడికి బయల్దేరుదామనుకున్న తెలుగుదేశం నాయకులను పోలీసులు గృహ నిర్భంధంలో వుంచారు. నెల్లూరులో పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, అబ్దుల్ అజీజ్, ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, తిరుమలనాయుడులను, గూడూరులో పాశం సునీల్‌కుమార్‌ను, వెంకటగిరిలో కురుగొండ్ల రామకృష్ణను, కోవూరులో చేజర్ల వెంకటేశ్వరరెడ్డిని హౌస్‌అరెస్ట్ చేశారు. పలుచోట్ల తెలుగు యువత, విద్యార్థి సంఘాలవాళ్ళు నిరసన ప్రదర్శనలు చేయగా పోలీసులు వారిని అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌లకు తరలించారు.

# విఆర్‌సి వాకర్స్ అసోసియేషన్ ప్రమాణస్వీకారం



నెల్లూరులోని విఆర్‌సి వాకర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం ఈ నెల 20వ తేదీన జరిగింది. అధ్యక్షులుగా లక్ష్మణరెడ్డి, ఉపాధ్యక్షులుగా అమ్మ ఫర్నీచర్ అధినేత గడ్డం సుధాకర్‌రెడ్డి, కార్యదర్శిగా మూర్తిలు ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ క్యాబినెట్ కార్యదర్శి ఎన్.బలరామయ్యనాయుడు, గవర్నర్ ఎస్.రాఘవేంద్రశెట్టి, నాగేశ్వరరావు, ఎం.వి.సుబ్బారెడ్డి, డాక్టర్ ఈశ్వర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, ఎస్.మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

# కేంద్రంలో నియంతృత్వం నడుస్తోంది!

**- శైలజానాథ్**




కేంద్రంలో ప్రజావ్యతిరేక పాలన నడుస్తోందని, ప్రధాని నరేంద్ర మోడీ, హోంమంత్రి అమిత్‌షాలు నియంతల్లా వ్యవహరిస్తున్నారని ఏపిసిసి అధ్యక్షుడు సాకే శైలజానాథ్ పేర్కొన్నాడు. సంక్రాంతి పండక్కి అత్తగారి వూరైన నెల్లూరుకు వచ్చిన శైలజానాథ్, 18వ తేదీ ఇందిరాభవన్‌కు విచ్చేశాడు. పీసీసీ అధ్యక్షుడయ్యాక నెల్లూరుకు తొలిసారిగా రావడంతో జిల్లా కాంగ్రెస్ కమిటి అధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆయనకు ఘన సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో పీసీసీ అధ్యక్ష బాధ్యతలు అప్పగించారని, ఈ బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వర్తిస్తానని చెప్పాడు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక నిర్ణయాలపై కాంగ్రెస్‌పార్టీ నిరంతర పోరాటం చేస్తుందన్నాడు. మాజీ ఎమ్మెల్యే సి.వి.శేషారెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఉడతా వెంకట్రావు, భవాని నాగేంద్రప్రసాద్, రఘురాం ముదిరాజ్, టి.బాల సుధాకర్, ఫరూఖ్, చింతాల వెంకట్రావ్, అనిల్, పూల చంద్రశేఖర్, కరీముల్లా, హుస్సేన్‌బాషా, షబ్బీర్, సురేష్‌బాబు, శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు

## తెలుగుజాతి ఖ్యాతిని..

# దశదిశలా చాటిన ఎన్టీఆర్

## - టిడిపి నేతల నివాళి



తెలుగుజాతి ఖ్యాతిని ఎన్టీఆర్ దశదిశలా చాటారని, ఆయన ఆంధ్రుల ఆరాధ్యదైవమని వక్తలు కొనియాడారు. విఖ్యాత సినీ నటుడు, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు వర్ధంతిని పురస్కరించుకుని ఈనెల 18న నెల్లూరులోని టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున కార్యక్రమాలు నిర్వహించారు. ఎన్టీఆర్ చిత్రపటాలకు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నగరంలోని పలు ప్రాంతాల్లో ఉచిత వైద్యశిబిరాలు, రక్తదానం, వస్త్రదానం, అన్నదానం తదితర సేవా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా మూలాపేటలోని అలంకార్ సెంటర్‌లో, అలాగే నర్తకి సెంటర్‌లో జరిగిన కార్యక్రమాలలో టిడిపి నేత బీద రవిచంద్ర మాట్లాడుతూ ఎన్టీఆర్ తెలుగుప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలచిపోయారన్నారు. ఆయన ఆశయాల బాటలో అందరూ నడవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీమంత్రి టి.రమేష్‌రెడ్డి, మాజీఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, మున్సిపల్ మాజీఛైర్‌పర్సన్ టి.అనూరాధ, టిడిపి నాయకులు ధర్మవరం సుబ్బారావు, అన్నంగి ప్రసాద్, శేఖర్, మురళి, ఆర్‌కెటి రాజా, బ్రహ్మంగుప్తా తదితరులు పాల్గొన్నారు. తొలుత అలంకార్ సెంటర్‌లో శ్రీకృష్ణుని రూపంలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి నాయకులు, అభిమానులు పెద్దఎత్తున తరలివచ్చి పూలమాలలు వేసి నివాళులర్పించారు.





# అపూర్వం... ఆ సమ్మేళనం



వింజమూరులోని జిల్లా పరిషత్ హైస్కూల్ 1989-90 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఈ నెల 17వ తేదీన హైస్కూల్ ప్రాంగణంలో వైభవంగా జరిగింది. ఆనాటి విద్యార్థులు తమ కుటుంబసభ్యులతో సహా ఈ వేడుకకు విచ్చేసి ఆనందంగా గడిపారు. 30ఏళ్ల తర్వాత అదే స్కూల్‌లో కలుసుకున్న పూర్వవిద్యార్థులు ఆనాటి జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఆనాడు తమకు విద్యాబుద్ధులు నేర్పించిన గురువులు రాధాకృష్ణమూర్తి, చెన్నకేశవులు, సుబ్బరామిరెడ్డి, కృష్ణమూర్తి, వెంకటేశ్వర్‌రావు, జమీర్, అంకిరెడ్డిలను వేదపండితుల ఆశీస్సులతో స్వాగతం పలికి ఘనంగా సత్కరించారు.

ఈ కార్యక్రమంలో హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు యల్లాల మాల్యాద్రి కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గురువులు పూర్వవిద్యార్థులకు తమ సందేశమిచ్చి, వారి అభివృద్ధిని ఆకాంక్షించారు. కొందరు పూర్వవిద్యార్థులతో పాటు వారి చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు, వినిపించిన పాటలతో కార్యక్రమం ఆహ్లాదంగా ముగిసింది.

# సోమిరెడ్డిపై కేసును కొట్టేసిన హైకోర్టు

మాజీమంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిపై వెంకటాచలం పోలీస్‌స్టేషన్‌లో నమోదు చేసిన క్రిమినల్ కేసును హైకోర్టు కొట్టేసింది. వైసిపి అధికారంలోకి వచ్చాక వెంకటాచలం మండలం ఇడిమేపల్లి గ్రామంలో భూముల కొనుగోలుకు సంబంధించి సోమిరెడ్డిపై వెంకటాచలం పోలీస్‌స్టేషన్‌లో ఫోర్జరీ, ట్రెస్పాస్‌తో పాటు పలు సెక్షన్‌ల క్రింద కేసులు నమోదు చేశారు. ఈ కేసుకు సంబంధించి విచారణకు సోమిరెడ్డి పోలీస్‌స్టేషన్‌కు వెళ్ళాడు. ఇడిమేపల్లి భూముల కొనుగోలుకు సంబంధించి 1933 నుండి వున్న డాక్యుమెంట్లను ఆయన అప్పుడే పోలీసులు, మీడియా ముందు కూడా వుంచాడు. తనపైన నమోదైన కేసుకు సంబంధించి సోమిరెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. దీనిని విచారించిన హైకోర్టు ఆయనపై దాఖలైన కేసును క్వాష్ చేసింది.

# గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించాలి


సమీక్షా సమావేశంలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ శేషగిరిబాబు

ఈనెల 26 వ తేది ఆదివారం జరిగే గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని, అందుకోసం నెల్లూరు పోలీసు పెరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ యంవి శేషగిరిబాబు అధికారులను ఆదేశించారు. ఈనెల 18న జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జేసీ వినోద్‌కుమార్, జేసీ-2 కమలకుమారి, డీఆర్వో మల్లిఖార్జున, జిల్లా అధికారులతో కలిసి గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గణతంత్ర దినోత్సవం రోజు శాఖలవారీగా సిద్ధంగా ఉండాలన్నారు. అధికారులంతా సమన్వయంతో పనిచేసి ఈ వేడుకలను విజయవంతం చేయాలన్నారు. విద్యార్థులను వేడుకలకు పద్ధతి ప్రకారం తీసుకుని రావడంతోపాటు తిరిగి వారి గమ్యస్థానాలకు సురక్షితంగా చేర్చేలా బాధ్యత తీసుకోవాలని కోరారు. డీఆర్‌డీఏ, ఐసీడీఎస్ పీడీలు శీనానాయక్, సుధా భారతి, నెల్లూరు ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, డీటీసీ సుబ్బారావు, డీఈఒ జనార్ధనాచారి, ఎస్ఎస్ఎ పీవో బ్రహ్మానందరెడ్డి, డీఎంహెచ్ఓ రాజ్యలక్ష్మీ, డీఎస్‌వో బాలకృష్ణారావు, డీపీవో ధనలక్ష్మి, సాంఘిక సంక్షేమశాఖ డీడీ జీవపుత్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్‌బికెఆర్‌కు సీఎస్ఐ అవార్డు

నెల్లూరు జిల్లా కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బీకేఆర్ ఇంజినీరింగ్ కళాశాల సీఎస్ ఈ విభాగానికి సీఎస్ఐ(కంప్యూటర్ సొసైటీ ఆఫ్ ఇండియా) ప్రతిభా అవార్డును అందజేసింది. ఈనెల 16 నుంచి 18వతేదీ వరకు సీఎస్ఐ 2020 యాన్యువల్ కన్వెన్షన్‌ను భువనేశ్వర్‌లో నిర్వహించారు.రీజియన్ల వారీగా కళాశాలలకు అవార్డులు ప్రకటించారు. ఎన్‌బీకేఆర్‌ను మూడవసారి ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి ఈనెల 20న తెలిపారు. కళాశాల తరపున సీఎస్ఈ హెచ్ఓడీ మారుతీ పెరుమాళ్, విద్యార్థి విభాగంలో ఎం.దినేష్ అవార్డులు అందుకున్నట్లు తెలిపారు.

## గూడూరు డివిజన్ వార్తలు

### పేదలకు చేసే
# సేవలను విస్తృతం చేయాలి
- డాక్టర్ సి.జనార్ధన్‌రెడ్డి


30వేల చెక్కును అందజేస్తున్న డాక్టర్ సి.జనార్ధన్‌రెడ్డి, రోహిణి

పేదలకు తనవంతు సాయం అందించేందుకు సేవలను విస్తృతం చేయాలని ప్రముఖ వైద్యుడు డాక్టర్ సి.జనార్ధన్‌రెడ్డి, సి.రోహిణి అన్నారు. మండలంలోని పాలిచర్లవారిపాళెంలో సింహపురి రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బి.శ్యామలమ్మ దాతృత్వంతో మంగళవారం గిరిజన కాలనీలోని వృద్ధులకు దుప్పట్లను పంపిణీ చేశారు. సంఘం ద్వారా చేపడుతున్న సేవా కార్యక్రమాలను వారు అభినందించారు. గ్రామంలో ఉన్న విఘ్నేశ్వర ఆలయ అభివృద్ధికి రూ.30వేల విరాళాన్ని డాక్టర్ సి.జనార్ధన్‌రెడ్డి, రోహిణి ఇచ్చారు. సంఘం కేంద్ర కమిటీ అధ్యక్షుడు వరిదిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి రూ. 10వేలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు దశరధరామిరెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, కె.జనార్ధన్‌రెడ్డి, ప్రజేంద్రరెడ్డి, రఘురామిరెడ్డి, సనత్‌రెడ్డి, వెంకటకృష్ణారెడ్డి, వివిధ మండలాలకు చెందిన ప్రతినిధులు, దాతలు తదితరులు పాల్గొన్నారు.

### కనుమూరు ఆధ్వర్యంలో
# వైభవంగా సీతారాముల తెప్పోత్సవం


పూజల్లో పాల్గొన్న కనుమూరు హరిచంద్రారెడ్డి దంపతులు

ఈ నెల 16వ తేదీ రాత్రి గూడూరు పట్టణం కోనేటిమిట్టలోని శ్రీ కోదండరామాంజనేయస్వామి దేవస్థాన ప్రాంతంలోని కోనేరులో శ్రీ సీతారాముల తెప్పోత్సవాన్ని అంగరంగ వైభవంగా కనుమూరు హరిచంద్రారెడ్డి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కనుమూరు హరిచంద్రారెడ్డి, కనుమూరు రవిచంద్రారెడ్డి సహకారంతో నిర్వహించారు. రంగురంగుల విద్యుత్ దీపాలంకరణల మధ్య మేళ తాళాలు, మంగళవాయిద్యాలు, బాణాసంచా మోతలు, వేదపండితుల వేదమంత్రోచ్ఛారణతో శాస్త్రోక్తంగా సీతారాముల తెప్పోత్సవాన్ని ఘనంగా చేపట్టారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని, అమ్మవారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అంతకుముందు దేవస్థానంలో శ్రీ సీతారాములకి వేదపండితులు ప్రత్యేక పూజలను చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

# వేమన పద్యాలు ఎంతో మధురం

గూడూరు పట్టణంలోని డిఎన్ఆర్ కమ్యూనిటీ హాల్‌లో యోగి వేమన జయంతిని పురస్కరించుకుని సింహపురి రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంఘ ఉపాధ్యక్షుడు దశరధరామిరెడ్డి మాట్లాడుతూ వేమన శతకాల ద్వారా ఎన్నో నీతి పద్యాలను ప్రజలకు అందించిన మహనీయుడని కొనియాడారు. వేమన పద్యాలు ఎంతో మందికి ఆదర్శంగా నిలిచాయని అన్నారు. వేమన జయంతిని రాష్ట్ర పండుగగా తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు గుర్తించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు ప్రజేంద్రరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

# ఉపరాష్ట్రపతిని కలిసిన భాజపా నాయకులు



జిల్లా పర్యటనలో భాగంగా వెంకటాచలం స్వర్ణభారత్ ట్రస్టుకు విచ్చేసిన భారత ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడును గూడూరు భాజపా నాయకుడు గాలి ప్రకాష్‌నాయుడు మర్యాదపూర్వకంగా కలిశాడు. ఈమేరకు వివిధ అంశాలపై వెంకయ్యనాయుడితో సుధీర్ఘంగా చర్చించినట్లు ఆయన సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరామని చెప్పాడు. గూడూరు అభివృద్ధికి సహకరించాలని విన్నవించినట్లు తెలిపాడు. భారతీయ జనతాపార్టీ నాయకులు పృధ్వి, బాలసుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

### రోడ్డు ప్రమాదాల నివారణలో
# యువతే కీలకం


ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న గూడూరు ప్రాంతీయ రవాణాశాఖాధికారి మల్లికార్జునరెడ్డి

రోడ్డు ప్రమాదాల నివారణలో యువతే కీలకంగా మారాలని, బాధ్యతగా వాహనాలు నడిపితే ప్రమాదాలు తగ్గించవచ్చని గూడూరు ప్రాంతీయ రవాణాశాఖాధికారి మల్లికార్జునరెడ్డి తెలిపారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా మంగళవారం గూడూరు పట్టణంలోని రైల్వేస్టేషన్ నుంచి జాతీయ రహదారి కూడలి వరకు ద్విచక్రవాహనాలతో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ రైల్వేస్టేషన్, ముత్యాలపేట, గడియారపు స్థంభం, రాజావీధి, కుమ్మరవీధి, గాంధీబొమ్మ సెంటర్, బజారువీధి, సంగం థియేటర్, దూడల కాలువ, విఘ్నేశ్వరపురం, ఆర్టీసీ బస్టాండ్, షిరిడిసాయి నగర్ మీదుగా జాతీయ రహదారి వరకు జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపకూడదని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ విధిగా ధరించాలని, అతివేగం, నిబంధనలు పాటించకుండా వాహనాలు నడపడం వల్ల ఎంతో మంది విలువైన ప్రాణాలు కోల్పోతున్నారని తెలియజేశారు. ఎంవిఐలు మురళీమోహన్, రాఘవరావు, అసిస్టెంట్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ శేషరెడ్డి, ఏవో ప్రతాప్, సిబ్బంది పాల్గొన్నారు.

# ముగిసిన షటిల్ టోర్నమెంట్



ప్రగతి సేవాసంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన గూడూరు టౌన్‌వైడ్ షటిల్ టోర్నమెంట్ ఘనంగా ముగిసింది. జిఎస్‌బిఏ నుంచి నాగార్జున, రూపేష్ టీం కప్పును గెలుచుకోగా, రన్నర్స్‌గా సివిజి పార్క్ నుంచి సూరి, ఇంతియాజ్ కప్ గెలుచుకున్నారు. మూడవ స్థానంలో జిఎస్‌బిఏ నుంచి జమీర్, చంద్ర నిలిచారు. 4వ స్థానంలో జిఎస్‌బిఏ నుంచి సంపత్, నంద నిలిచారు. గెలుపొందిన క్రీడాకారులకు ముఖ్యఅతిథులుగా పాల్గొన్న వైసిపి నాయకులు కోడూరు మీరారెడ్డి బహుమతులను అందజేశారు. సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగిన ఈ టోర్నీలో నాగేంద్రరెడ్డి, ప్రజేంద్రరెడ్డి, కరిముల్లాఖాన్, కాటూరు శ్రీనివాసులు, ప్రభాకర్, రమణయ్య, పిఇటి పాల్గొన్నారు.

## హెల్మెట్ పెట్టుకోండి..

# ప్రాణాలు కాపాడుకోండి

**- రోజాపువ్విచ్చి మరీ చెప్తున్న డిటిసి**



శిరస్త్రాణం (హెల్మెట్) ధరించండి.. ప్రాణాలు కాపాడుకోండి అంటూ రవాణాశాఖ అధికారులు వాహనదారులకు రోజాపూలిచ్చి మరీ హితవు చెప్పారు. వినూత్నమైన రీతిలో వీరు చేపట్టిన ఈ అవగాహన కార్యక్రమం వాహనదారులను మేల్కొలుపుతోంది. రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా ఈనెల 19న రవాణాశాఖ అధికారులు నెల్లూరు నగరంలోని ముత్తుకూరురోడ్డులో వాహనదారులను నిలిపి హెల్మెట్ పెట్టుకోండని సూచించారు. ఈ సందర్భంగా ఉప రవాణా కమిషనర్(డిటిసి) సుబ్బారావు మాట్లాడుతూ వాహనదారులు నిబంధనలు పాటించకపోవడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని, ప్రమాదాలు జరగకుండా తగు జాగ్రత్తలు పాటించాలని వాహనదారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంవిఐలు మురళీమోహన్‌రావు, బాలమురళీకృష్ణ, రఫీ, షేక్ బాబు, జాకీర్, సునీల్, ఏఎంవిఐ సౌజన్య, ఏఓ మదాని, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

## నష్టాల బాటలో నెల్లూరు ఆర్టీసి రీజియన్

ఆర్టీసి నెల్లూరు రీజియన్ పరిధిలో ఈ ఆర్థికసంవత్సరం ఇప్పటివరకు సుమారు 60 కోట్ల రూపాయల దాకా నష్టాల్లోనే ఉందని ప్రజా రవాణాశాఖ సంయుక్త ఉప కమిషనర్ పివి శేషయ్య పేర్కొన్నారు. ఈనెల 18న ఆత్మకూరు ఆర్టీసి డిపోను ఆయన సందర్శించారు. ఆత్మకూరు డిపో 8 కోట్ల నష్టాల్లో ఉందన్నారు. ఆర్టీసిని ప్రభుత్వంలో విలీనం చేసినా లాభనష్టాల గణన గతంలో మాదిరిగానే ఉందన్నారు. ఆక్యుపెన్సీ రేషియోపై దాని ప్రభావం ఏమీ లేదని, చార్జీల పెంపుతో 10 శాతం వరకు రాబడి మొత్తం మాత్రం పెరిగిందని చెప్పారు. ఆత్మకూరు డిపో సహాయ కమిషనర్ రాంబాబు, యూనియన్ నాయకులు ఎస్వీ సుబ్బారావు, పికె హసన్, జి.సునీల్‌కుమార్‌రెడ్డి, జి.హజరత్తయ్య, యు.నరసింహులు తదితరులు పాల్గొన్నారు.



# భక్తిశ్రద్ధలతో గొబ్బెమ్మల నిమజ్జనం..



సంక్రాంతి పండుగ సంబరాల్లో చివరి రోజైన ఈనెల 18న అశేష జనవాహినితో నెల్లూరు పెన్నానదీ తీరం కిక్కిరిసింది. చిన్నాపెద్దా ఏటిపండుగలో ఆనందోత్సాహాలతో గడిపారు. జిల్లా నలుమూలల నుండి ప్రజలు పెన్నానదీ తీరానికి మధ్యాహ్నం 3 గంటలకే చేరుకున్నారు. బంధుమిత్ర సపరివారంగా పెన్నాతీరంలో ఆహ్లాదకరమైన వాతావరణంలో గాలిపటాలు ఎగురవేస్తూ సందడి చేశారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలను తిలకించారు. సంక్రాంతి పండుగ దినాల్లో 30 రోజులపాటు తమతమ ఇళ్ళలో గొబ్బి గౌరమ్మను పూజించిన ముత్తైదువులు, కన్నెపిల్లలు గొబ్బెమ్మకు విశేష పూజలు నిర్వహించి గొబ్బెమ్మ పాటలు పాడి పెన్నానదిలో నిమజ్జనం చేశారు. ప్రత్యేక ఆకర్షణగా జిల్లాలోని పలు దేవాలయాల ఉత్సవమూర్తులు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. నరశింహకొండ వేదగిరి లక్ష్మీ నరసింహస్వామి, జొన్నవాడ కామాక్షితాయి, నర్రవాడ వెంగమాంబ పేరంటాలు, శ్రీ తల్పగిరి రంగనాథస్వామి, శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారు, కనుపూరు ముత్యాలమ్మ, శ్రీ ఇరుకళల పరమేశ్వరీ అమ్మవారు, శ్రీ భువనేశ్వరీ సమేత మూలస్థానేశ్వరస్వామి, శ్రీకృష్ణ ధర్మరాజుల స్వామి భక్తులకు కమనీయంగా దర్శనమిచ్చారు. దీపాలు వెలిగించిన బెలూన్లను వైసీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, పి.రూప్‌కుమార్‌యాదవ్ ఎగురవేసి పిల్లలకు గాలిపటాలను పంపిణీ చేశారు. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. దేవాదాయశాఖ, పలు స్వచ్ఛంద సంస్థలు మంచినీరు, మజ్జిగ పంపిణీ చేశారు. నగర డీఎస్పీ ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

## కాశినాయన జయంతి వేడుకలు 24న

అవధూత కాశినాయన జయంతి వేడుకలు ఈనెల 24న ఘనంగా నిర్వహించనున్నారు. జిల్లాలోని సీతారామపురం మండలంలోని బెడుసుపల్లిలో ఈ వేడుకలను వైభవంగా నిర్వహించనున్నట్లు కాశినాయన మనుమడు ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. అదేరోజు కాశినాయనకు అభిషేకం, రాత్రి108 మంది మహిళలతో జ్యోతి ఉత్సవం, అర్ధరాత్రి దాటాక రథోత్సవం నిర్వహిస్తామన్నారు.

శ్రీను గల్పిక

# అడుక్కోవడం కూడా ఒక ఆర్టే!

గుంటూరులోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం. హైటెక్‌రత్న చంద్రబాబు నాయుడుతో పాటు లోకేష్, గోరంట్ల బుచ్చయ్యచౌదరి, పత్తిపాటి పుల్లారావు, దేవినేని ఉమ, పి.నారాయణ, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ధూళిపాళ్ళ నరేంద్ర వంటి నాయకులు వున్నారు. అమరావతి రాజధానిపై చర్చ జరుగుతోంది. చంద్రబాబు మాట్లాడుతూ ఈ జగన్ నా క(కు)లల సామ్రాజ్యాన్ని కూలదోస్తున్నాడు. అమరావతిపై నేను కన్న కలలను భగ్నం చేస్తున్నాడు. అమరావతి రాజధానిని కాపాడుకోవాలంటే పోరాటాన్ని ఉధృతం చెయ్యాలి. ధర్నాలు, బంద్‌లు, ఆందోళనలకు బాగా ఖర్చవుతుంది. దీనిని మనమంతా కలిసి భరించాలన్నాడు. వెంటనే జేసీ దివాకర్‌రెడ్డి లేచి... మాకాడ అంత సీన్ లేదు, మొన్న ఎన్నికలకే తడారిపోయింది, ఒంటి మీద గుడ్డలు కూడా అమ్ముకునే పరిస్థితి... ఉద్యోగం సద్యోగం లేదని ఇళ్ళ దగ్గర మా పెళ్లాలు తిండి కూడా పెట్టడం లేదు, ఇకనుండి పార్టీకి అయ్యే ఖర్చయినా, పోరాటాలకు అయ్యే ఖర్చైనా మీరే పెట్టాలని నిర్మొహమాటంగా చెప్పాడు. అందుకు చంద్రబాబు... నాకు రూపాయి ఖర్చున్నా మా ఆవిడ భువనేశ్వరియే ఇస్తుంది... పార్టీ కోసం డబ్బులడిగితే ఏమంటుందోనని నాకు భయంగా వుంది అని అన్నాడు. అది విని లోకేష్... డోంట్‌వర్రీ డాడీ, అమ్మ ఏమీ అనుకోదు, మనం రాజధాని పోరాటం కోసం డబ్బులడిగితే హ్యాపీగా ఇస్తుంది, రాజధాని పోరాటానికి ముందుగా తన చేతి బంగారుగాజులను దానం చేసింది అమ్మే కదా అని చెప్పాడు. లోకేష్ మాటలతో చంద్రబాబుకు కొంత ధైర్యం వచ్చింది.

★★★★★

హైదరాబాద్‌లోని చంద్రబాబు పేద గృహము. భువనేశ్వరీదేవి అగ్గిమీద గుగ్గిలంలా మండిపడుతోంది... మీ పరువు కోసం నేనేదో ఆరోజు బంగారు గాజులు దానం చేశాను, అంత మాత్రాన మన ఆస్తులమ్మి పార్టీని నడుపుతాను, అమరావతి రాజధాని కోసం పోరాటాలు చేస్తాను అంటే ఒప్పుకునే ప్రసక్తే లేదు... మీ రాజధాని పోరాటాల ఖర్చులకు నేను రూపాయి కూడా ఇవ్వను అంటూ కసిరింది. దానికి చంద్రబాబు... అదేంటి భువి... ఈ ఆస్థంతా నేను సంపాదించిందే కదా, పార్టీ ఖర్చులు, రాజధాని పోరాటాల ఖర్చుల కోసం పది లక్షలు అడిగితే ఇవ్వనంటావేం అని అడిగాడు. దానికి భువనేశ్వరి ఇంకొంచెం ఆవేశంగా... ఈ ఆస్థులన్నీ మీరు సంపాదించారా... ఎవరు సంపాదించారో చూపిస్తానుండండి అంటూ... బ్రాహ్మణి అని కేకేసింది. ఒక్క నిముషంలో అక్కడకు బ్రాహ్మణి వచ్చింది. రాత్రి నేను చెప్పిన సీన్ ఒక్కసారి ప్లే చేయమ్మా అని భువనేశ్వరీదేవి చెప్పింది. బ్రాహ్మణి సెల్‌ఫోన్ తీసి గ్యాలరీలో ఓ వీడియోను ఆన్ చేసింది. అది తెలుగుదేశం పార్టీ మహానాడులో లోకేష్ స్పీచ్.. మాది చాలా పేద కుటుంబం, నాన్నకు నాకు ఇద్దరికీ సంపాదన లేదు. అమ్మ, బ్రాహ్మణిలే పాలు, పెరుగు, కూరగాయలు అమ్మి మమ్మల్ని సాకుతున్నారు అని చెప్పాడు. ఆ సీన్ ముగియడంతో బ్రాహ్మణి సెల్‌ఫోన్ ఆఫ్ చేసింది. వీడికి ఎక్కడ ఏమి మాట్లాడాలో తెలియదు, వీడేం మాట్లాడినా నా మెడకే చుట్టుకుంటుందన్నట్లు చంద్రబాబు లోకేష్ వైపు కోపంగా చూసి... ఇప్పుడు ఖర్చులకు డబ్బులెలా చేయమంటావ్ అని భువనేశ్వరీదేవిని కోపంగా అడిగాడు. ఆమె అంతకంటే కోపంగా 'ఊరూరు తిరిగి అడుక్కోండి' అని అంది. ఆ మాట చంద్రబాబు చెవుల్లో పదేపదే మార్మోగసాగింది. అయితే అదే సమయంలో లోకేష్ ఆ మాటను భలే క్యాచ్ చేశాడు. అమ్మ ఆవేశంలో చెప్పినా మంచి ఐడియా ఇచ్చింది నాన్నా... ఈ రాజధాని పోరాటం కోసం మనమెందుకు ఇంట్లో డబ్బులు ఖర్చుపెట్టాలి, ఇక్కడి జనాల చేతే పెట్టిద్దాం... ఊరూరా జోలెపట్టి ఇద్దరం అడుక్కుందామన్నాడు. చంద్రబాబు అందుకు ఇంత బ్రతుకు బ్రతికి అడుక్కోవడమేంటిరా... అయినా అడుక్కోవడంలో నాకు పెద్దగా అనుభవం లేదని చెప్పాడు. లోకేష్ వుండి... అడుక్కోవడం ఒక ఆర్ట్ నాన్నా, పరిస్థితులను దానికి వాడుకోవాలి, తెలంగాణ ఉద్యమం సమయంలో హైదరాబాద్ వీధుల్లో కేసీఆర్ అంకుల్ అడుక్కోలేదా... కాకపోతే ఆయన కూలీ వేషంలో అడుక్కున్నాడు, మనం రాజధాని పోరాట యోధుల రూపంలో అడుక్కుందామన్నాడు. నాకు ఈ పనేదో కొత్తగా వుందిరా లోకేష్... అడుక్కోవడానికి నేను పనికొస్తానంటావా? అని చంద్రబాబు ప్రశ్నించాడు. దానికి లోకేష్... పుట్టగానే ఎవ్వరూ భిక్షగాళ్ళు కాదు నాన్నా, కాలమే వారికి అన్నీ నేర్పిస్తుంది, అయినా నీకు అడుక్కోవడంపై అవగాహన కావాలి అంతేగా అని తలపైకెత్తి రెండు నిముషాలు ఆలోచించాడు. వెంటనే అతని బుర్రకు పవన్‌కళ్యాణ్ హీరోగా నటించిన "అత్తారింటికి దారేది" సినిమా గుర్తుకు వచ్చింది. ఆ సినిమాలో కోటీశ్వరుడైన పవన్‌కళ్యాణ్ తన అత్త కారుకు డ్రైవర్‌గా మారిన తర్వాత డ్రైవర్ హావభావాలు ఎలా వుంటాయో తెలుసుకోవడానికి ఎన్టీఆర్, ఏఎన్నార్, చిరంజీవిలు డ్రైవర్లుగా నటించిన సినిమాల సిడిలను చూసే సీన్ అతనికి గుర్తొచ్చింది. వెంటనే టీవీ ఆన్ చేశాడు. చంద్రబాబును ఎదురుగా వున్న సోఫాలో కూర్చోబెట్టాడు. మొదట 'మామగారు' సినిమా పెట్టాడు. అందులో గోచిగుడ్డ పెట్టకుని 'అంబా' అంటూ బాబూమోహన్ అడుక్కునే సీన్‌లు వస్తున్నాయి... మరీ ఇంత ఛండాలంగా అడుక్కుంటే బాగుండదేమోరా అని చంద్రబాబు అన్నాడు. అయితే ఈ సీన్ చూడండి అంటూ 'పోకిరి' సినిమాలో బిక్షగాళ్ళ అసోసియేషన్ కార్యదర్శి ఆలీ అడుక్కునే సీన్‌లు చూపించాడు. దీనికంటే బెటర్ సీన్‌లేమీ లేవా అని చంద్రబాబు అడిగాడు. వెంటనే లోకేష్ సలీం హీరోగా నటించిన 'బిచ్చగాడు' సినిమాను ఆన్ చేశాడు. ఆ సినిమాలో హీరో తన తల్లిని బ్రతికించుకోవాలంటే... ఆరు నెలల పాటు బిక్షగాడిగా అడుక్కోవాలని తెలుస్తుంది. హీరోగా అలాగే అడుక్కుంటాడు. ఆ సీన్‌లు చూశాకా... ఇది కొంచెం బెటర్‌గా వుందిరా లోకేష్.. అని చంద్రబాబు అన్నాడు. ఈ సీన్ చూశాక నాకు ఇంకో ఐడియా కూడా వచ్చింది నాన్నో అని లోకేష్ అన్నాడు. ఏంటది అని చంద్రబాబు ప్రశ్నించాడు. మీరెందుకు అడుక్కుంటున్నారని ఎవరైనా ప్రశ్నిస్తే అమరావతిని రాజధానిగా కొనసాగించేంతవరకు అడుక్కుంటూనే వుంటామని దేవుడికి మొక్కుకున్నామని చెప్పుకోవచ్చని లోకేష్ అన్నాడు. అంటే నువ్వు చెప్పేది... ఇక జీవితాంతం నన్ను అడుక్కోమనా? అని చంద్రబాబు ప్రశ్నించాడు. కలెక్షన్‌ను బట్టి చూద్దాంలే డాడీ అని లోకేష్ అనడంతో... చంద్రబాబు విరాళాల సేకరణకు ఖద్దరు ఫ్యాంటు, షర్ట్ వేసి బూట్లు తొడిగి రెడీ అయ్యాడు. లోకేష్ అది చూసి... ఈ గెటప్‌లో పోతే ఎవ్వరూ రూపాయి ఇవ్వరు అంటూ ఒక కత్తెర తెచ్చి చొక్కాకు రెండు, ఫ్యాంట్‌కు నాలుగు బొక్కలు పెట్టాడు. ఇప్పుడు జోలె పట్టి పదండి... ఈ అవతారం చూశాక కరగని మనిషి వుండడు.. కరెన్సీ నోటు వేయని చేయివుండదు... అని లోకేష్ చెప్పాడు. చంద్రబాబు నేరుగా ఫ్లైట్‌లో గన్నవరం ఎయిర్‌పోర్టులో దిగి తుళ్లూరు వద్దకు వచ్చాడు. అప్పటికే చంద్రబాబు వస్తున్నాడని తెలిసి తెలుగుదేశం నాయకులంతా వచ్చివున్నారు. చంద్రబాబు కారు దిగడంతోటే జోలెపట్టి అయ్యా ధర్మం... అమ్మా ధర్మం... అని అరవసాగాడు. చంద్రబాబు అవతారం, ఆయన అరుపులు విన్న సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి... ఎందరికో రాజకీయ భిక్ష పెట్టిన మీరు... భిక్షం వేయమనడం ఏంటయ్యా అంటూ బాధతో స్పృహతప్పి పడిపోయాడు. అక్కడున్న వాళ్లంతా ఆయనను హడావిడిగా హైదరాబాద్ అపోలో ఆసుపత్రికి తరలించారు.

# అమ్మ భాష అమృతమే

(మొదటి పేజీ తరువాయి)




కవులు, రచయితలు, భాషావేత్తలు, ప్రముఖులు పాల్గొని అధ్యయన కేంద్రం అభివృద్ధికి, తెలుగు భాషాభివృద్ధికి తమ అభిప్రాయాలను, సూచనలు తెలియజేశారు. శాసనాలు, లిపి, చరిత్ర, తాళపత్ర గ్రంథాలు, ప్రాచీన గ్రంథాలు, వ్యాకరణం, సాహిత్యం తదితర అంశాలన్నింటిపై సుదీర్ఘంగా చర్చించారు. ప్రాచీన గ్రంథాలను, శాసనాలను సేకరించి డిజిటలైజ్ చేసి ఈ అధ్యయనకేంద్రలో భద్రపరచాలని సూచించారు. రెండువేల సంవత్సరాల చరిత్ర కలిగిన తెలుగుభాష ఎంతో ఘనమైనది.. ప్రాచీనమైనదని, తెలుగుభాషను పరిరక్షించుకుంటూ భావితరాలకు మార్గదర్శకం కావాలని పేర్కొన్నారు. భారతీయ భాషా సంస్థ డైరెక్టర్ ఆచార్య డిజి రావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్రపతి అవార్డు గ్రహీత శలాక రఘునాధశర్మ, ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయనకేంద్రం డైరెక్టర్ మునిరత్నంనాయుడు, ప్రముఖకవి జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు, ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం, సిలికానాంధ్ర అధ్యక్షుడు ఆనంద్, సాహిత్య అకాడమీ కార్యదర్శి శ్రీనివాసరావు తదితర ఎందరో ప్రముఖ భాషావేత్తలు పాల్గొన్నారు.

### అమ్మభాషను అభివృద్ధి చేసుకోవాలి - వెంకయ్యనాయుడు

అమ్మభాషను అభివృద్ధి చేసుకోవాలని, తెలుగుకు కొత్త వెలుగులు తీసుకురావాలనే ఆకాంక్షతో భారత ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు నెల్లూరుజిల్లాలో రెండురోజులు పాటు జరిపిన పర్యటనలో తెలుగు భాషావేత్తలతో పలుసార్లు ఉద్ఘాటించారు. జిల్లాలోని వెంకటాచలం మండలం సరస్వతి నగర్‌లోని ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రాన్ని కేంద్ర మానవ వనరుల అభివృద్ధిశాఖ మంత్రి రమేష్ పొఖ్రియాల్, రాష్ట్ర గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్‌తో కలసి ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు ఈనెల 21న సందర్శించారు. ఈ సందర్భంగా స్వర్ణభారత్ ట్రస్ట్‌లో ఏర్పాటుచేసిన అధ్యయన కేంద్రం అభివృద్ధి కార్యగోష్టి ముగింపుసభలో ఆయన మాట్లాడుతూ తెలుగుభాష ప్రాచుర్యం కోల్పోకుండా భాష ఔన్నత్యాన్ని పరిపుష్టం చేయడం కోసమే ఈ అధ్యయన కేంద్రాన్ని మైసూరు నుంచి నెల్లూరుకు తరలించినట్లు వివరించారు. అధ్యయన కేంద్రానికి రాష్ట్రప్రభుత్వం స్థలం ఇచ్చిందని, భవన నిర్మాణాలకు సమయం పట్టే అవకాశం ఉండడంతో తాత్కాలికంగా ఇక్కడ ఏర్పాటు చేశామని, ఎవరైనా ఇంతకంటే మెరుగైన భవనాలను చూపితే అక్కడికి తరలించడానికి సిద్ధమని అన్నారు. భాషా పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత అని, ఆ దిశగా భాషావేత్తలు, భాషాభిమానులు ముందుకువచ్చి భాషను పరిరక్షించుకోవాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు ఈ విషయంలో ప్రత్యేకచొరవ చూపాలన్నారు. అప్పుడే అమ్మభాషను అభివృద్ధి చేసుకోవడానికి, భాషను బతికించుకోవడానికి వీలవుతుందని ఉపరాష్ట్రపతి సూచించారు. రాజ్యసభలో మాతృభాషలో మాట్లాడేందుకు అవకాశం ఇవ్వడం, రాజకీయాలకు అతీతంగా సభ్యుల్లో ఎంతో ఆనందం కలిగించిందని గుర్తుచేశారు. ఈ అధ్యయన కేంద్రం ఏర్పాటుపై తెలంగాణ ముఖ్యమంత్రి కెసిఆర్ లేఖ రాశారని, తమకూ ఓ కేంద్రాన్ని ఇవ్వాలని కోరారని ఆయన తెలిపారు. అనంతరం ఆయన అధ్యయనకేంద్రం వెబ్‌సైట్‌ను ప్రారంభించి పుస్తకాలను ఆవిష్కరించారు. తొలుత అక్షర విద్యాలయం విద్యార్థులతో మమేకమై ఆరోగ్యం-క్రమశిక్షణ ఆవశ్యకతను ఆయన విద్యార్థులకు వివరించారు. కేంద్రమంత్రి రమేష్ పొఖ్రియాల్ మాట్లాడుతూ ప్రాచీన అధ్యయన కేంద్రం అభివృద్ధికి ఎన్‌ఐఓటి, ఎన్‌సిఈఆర్టీ నెలకొల్పేందుకు కృషిచేస్తామన్నారు. గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ మాట్లాడుతూ మాతృభాష పరిరక్షణకు నడుంబిగించడం శుభపరిణామమన్నారు.

### అందరినీ ఆకట్టుకున్న బాలూ గానం



భారతీయ సినీ గాయకులు, గానగంధర్వుడు ఎస్‌పి బాలసుబ్రహ్మణ్యం ఈ సందర్భంగా 'తెలుగు భాష తియ్యదనం, తెలుగు జాతి గొప్పదనం.. తెలుసుకున్నవాళ్ళకీ తెలుగే ఒక మూలధనం'' అంటూ తెలుగుభాష, తెలుగుజాతి విశిష్టత గురించి వివరించే సినీగీతాన్ని అత్యద్భుతంగా గానం చేసి అందరి కరతాళ ధ్వనులందుకున్నారు. తొలుత, అక్షర విద్యాలయం వారు తెలుగుభాష ప్రాముఖ్యతను, ప్రాశస్త్యాన్ని చాటిచెప్తూ ప్రదర్శించిన రూపకం ఎంతో హృద్యంగా ఉండి అందరి ప్రశంసలూ అందుకుంది. ఈ కార్యక్రమంలో స్వర్ణభారత్ ట్రస్టీ, ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు కుమార్తె దీపా వెంకట్, నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకరరెడ్డి, తెలుగుభాషా ప్రముఖులు యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, మండలి బుద్ధప్రసాద్, ప్రముఖ సినీకవులు వెన్నెలకంటి, భువనచంద్ర, జొన్నవిత్తుల తదితరులంతా పాల్గొన్నారు.

### అలరించిన 'భువన విజయం'

ఈ సందర్భంగా స్వర్ణభారత్ ట్రస్ట్ ప్రజామందిరంలో ప్రముఖ శతావధాని గండ్లూరి దత్తాత్రేయ బృందం వారు ప్రదర్శించిన 'భువన విజయం' నాటకం అందరినీ ఆకట్టుకుంది. అనంతరం ఆ నాటక బృందాన్ని ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ఘనంగా సన్మానించారు. జిల్లా పర్యటనకు ఉప రాష్ట్రపతి విచ్చేయగానే జిల్లా కలెక్టర్ ఎంవి శేషగిరిబాబు, జిల్లా ఎస్పీ భాస్కర్ భూషణ్, తిరుపతి ఎంపి బల్లి దుర్గా ప్రసాదరావు, ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి తదితర ప్రముఖులంతా వెళ్ళి వెంకటాచలం రైల్వేస్టేషన్‌లో ఆయనకు సాదరస్వాగతం పలికారు. ఉపరాష్ట్రపతి పర్యటనకు పోలీసులు పెద్దఎత్తున బందోబస్తు నిర్వహించి భారీ భద్రతా ఏర్పాట్లుచేశారు.




తెలుగు భాష ప్రాశస్త్యాన్ని చాటి చెప్పిన 'అక్షర' విద్యార్థుల నృత్య రూపకం

## ఆకాశవాణి సర్వభాష కవి సమ్మేళనంలో పెరుగు



గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్‌లోని రవీంద్రభారతి ఆడిటోరియంలో ఈనెల22న ఆకాశవాణి డిప్యూటి డైరెక్టర్ జనరల్ శైలజ సుమన్, తెలంగాణా రాష్ట్ర సాంస్కృతిక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన సమ్మేళనంలో నెల్లూరు కవి పెరుగు రామకృష్ణ పాల్గొన్నాడు. తెలుగు రాష్ట్రాల్లోని 12 ఆకాశవాణి కేంద్రాల నుంచి ఎంపిక చేసిన 22 మంది కవులు 22 భాషలకు చెందిన అనువాద కవితలు చదివి ప్రశంసలందుకున్నారు. కవులందరినీ శైలజాసుమన్ సత్కరించారు.

## ఆఫ్కాఫ్ ఛైర్మెన్‌గా అనిల్



ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఫిషర్‌మెన్ కో-ఆపరేటివ్ సొసైటీస్ ఫెడరేషన్ (ఆఫ్కాఫ్) ఛైర్మెన్‌గా నెల్లూరుజిల్లాకు చెందిన మత్స్యకార నాయకుడు కొండూరు అనిల్‌బాబును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం విజయవాడలోని మత్స్యశాఖ కమిషనర్ కార్యాలయంలో ఎన్నిక జరిగింది. అనిల్‌బాబు కొంత కాలంగా వైసిపిలో కీలకపాత్ర పోషిస్తున్నాడు. మత్స్యకారులను పార్టీవైపుకు మళ్లించడంలో గట్టిగానే పనిచేశాడు. అనిల్‌ను పలువురు వైసిపి నాయకులు అభినందించారు. మంగళవారం నాడు అమరావతిలో ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డిని కలిసిన అనిల్, తనపై నమ్మకంతో పెద్ద బాధ్యతను అప్పగించినందుకు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలియజేశాడు.

## రచయిత హనుమారెడ్డికి నివాళులు



నెల్లూరు జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత, ప్రకాశం జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు బీ.హనుమారెడ్డి సంతాపసభ ఈనెల 22న నెల్లూరు టౌన్‌హాలులోని రీడింగ్ రూమ్‌లో జరిగింది. ఈ సందర్భంగా పలువురు కవులు, రచయితలు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, రచయితల సమస్యల పరిష్కారం కోసం ఆయన చేసిన కృషిని కొనియాడారు. నెరసం అధ్యక్ష ప్రధానకార్యదర్శులు ఎ.జయప్రకాష్, పాతూరి అన్నపూర్ణ, మాటేటి రత్నప్రసాద్, డాక్టర్ పెళ్ళకూరు జయప్రద, ఆచార్య ఆదిత్య, సయ్యద్ నజ్మాషమ్మీ తదితరులు పాల్గొన్నారు.

### కాలధర్మం

## అంధుల అమ్మ రోశమ్మ (రాజమ్మ)



నెల్లూరు మదర్‌థెరిస్సాగా పేరుగాంచిన ప్రముఖ సంఘ సేవకురాలు, దర్గామిట్టలోని విశ్వభారతి అంధుల పాఠశాల వ్యవస్థాపకురాలు పోరెడ్డి రోశమ్మ(రాజమ్మ) ఈ నెల 21వ తేదీ కన్ను మూశారు. వృద్ధాప్య కారణంగా ఆమె కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆమె వయసు 93సంవత్సరాలు. ఆమెకు ఒక కుమారుడు, ఒక కుమార్తె వున్నారు.

వింజమూరుకు చెందిన రోశమ్మ నర్సు వృత్తిలో వుంటూ తొలుత రోగులకు సేవలందించారు. గర్భిణీస్త్రీల కాన్పుల సమయంలో కొందరు చూపులేని పిల్లలు పుట్టడం, తల్లిదండ్రులు ఆ పసిబిడ్డలను వదిలిపోవడం వంటి సంఘటనలను చూసి చలించిపోయిన ఆమె, అంధులైన పిల్లలను కాపాడుకునేందుకు 1974లో నెల్లూరు, దర్గామిట్టలో పెద్దాసుపత్రి ఎదురుగా ఒక పూరిగుడిసెలో 'విశ్వభారతి అంధుల పాఠశాల'ను స్థాపించారు. ఆరోజు తనకొచ్చే 180 రూపాయల జీతంతోనే ఓ పక్క కుటుంబాన్ని నడుపుతూ, తన బిడ్డలను చదివించుకుంటూ, ఇంకోపక్క అంధుల పాఠశాలలోని పసిబిడ్డల ఆలనా పాలనా చూసేవారు. ఓ దశలో ఆర్థిక స్థోమత చాలక అంధుల పాఠశాల నిర్వహణ భారంగా మారడంతో ఆమె అక్కడి విద్యార్థులను హైదరాబాద్‌లోని ఓ ఆశ్రమంలో చేర్చడానికి తీసుకెళ్లారు. అయితే అక్కడ నిర్వహణ సరిగాలేకపోవడం, పెట్టే భోజనం నాణ్యంగా లేకపోవడం, ముఖ్యంగా అక్కడ నిర్వాహకులు పిల్లల పట్ల చూపుతున్న యాంత్రికమైన శ్రద్ధ ఆమెకు నచ్చలేదు. కష్టమైనా నష్టమైనా ఈ చూపులేని పసిబిడ్డలను నేనే ప్రేమగా చూసుకుంటానంటూ ఆ పిల్లలను తీసుకుని తిరిగి నెల్లూరుకు వచ్చేశారు. తనకొచ్చే జీతంతో పాటు మానవతావాదులు ఇచ్చే విరాళాలతో పాఠశాలను నడపసాగారు. 1990 ప్రాంతంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా పాఠశాల గుడిసెలు తగలబడగా, నిలువనీడలేని అంధ చిన్నారుల పాలిట కీర్తిశేషులు, మాజీ ఎంపి మాగుంట సుబ్బరామరెడ్డి కొండంత అండగా నిలిచారు. విశ్వభారతి అంధుల పాఠశాలకు ఆయన తన దాతృత్వంతో శాశ్వత భవనాలు కట్టించారు. ఇప్పుడు ఆ భవనాలలోనే నడుస్తున్న పాఠశాలలో 52మంది అంధులైన విద్యార్థులున్నారు. ఎందరో దాతలు ఈ పాఠశాల అభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తున్నారు. మహనీయుల జయంతులు, వర్ధంతులు, పలువురి పుట్టినరోజు వేడుకలు, పెళ్లి రోజులు ఇక్కడి విద్యార్థుల మధ్యే జరుపుకుంటున్నారు.

సమాజానికి మంచి చేయాలంటే కోట్లు వుండాల్సిన అవసరం లేదు, గట్టి సంకల్పం వుంటే చాలు అనే దానికి పోరెడ్డి రోశమ్మ ఓ ఉదాహరణ. ఒక సాధారణ నర్సుగా వున్న ఆమె తన సంకల్పంతో ఒక అంధుల పాఠశాలను ఏర్పాటు చేయడం, వేలాదిమంది అంధ విద్యార్థులకు ఆమె తల్లిగామారి వారి చీకటిజీవితాలకు వెలుగు బాటలు వేయడం... ఒక గొప్ప మానవతా కోణం. మానవతావాది రోశమ్మ మృతికి సంతాపం ప్రకటిస్తూ వారి కుటుంబసభ్యులకు సానుభూతి తెలుపుతోంది 'లాయర్'.

# విపక్షాల్లో చీలిక

(మొదటి పేజీ తరువాయి)

జగన్ మూడు రాజధానుల అంశానికి మద్దతుగా నిలిచాడు. ఇక సీపీఐలో చూసినా ఈ విషయంలో రెండు దారులున్నాయి. అమరావతిని రాజధానిగా కొనసాగించాలంటూ ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, చంద్రబాబుతో కలిసి ఆందోళనలలో పాల్గొంటుండడాన్ని ఆ పార్టీ మిగతా నాయకులు వ్యతిరేకిస్తున్నారు. మీ వ్యక్తిగత అభిప్రాయాన్ని పార్టీపై ఎందుకు రుద్దుతారంటూ ఆయనపై మండిపడుతున్నారు.

## బీజేపీలో రెండుదారులు

ఆంధ్రప్రదేశ్ రాజకీయాలలో భారతీయ జనతా పార్టీ అనుసరిస్తున్న వైఖరేంటో, అది ఎవరికి అనుకూలమో? ఎవరికి ప్రతికూలమో? అర్థంకాక జనం జుట్టు పీక్కుంటున్నారు. ఎన్నికల ముందువరకు బీజేపీది క్లియర్ స్టాండ్... చంద్రబాబును ఓడించాలి అనే ఒకే ఒక లక్ష్యంతో ఆ పార్టీ శ్రేణులు పనిచేశాయి.

ఎన్నికలకు ముందు తెలుగుదేశంతో పొత్తు తెగనంత వరకు రాష్ట్ర బీజేపీలో రెండు గ్రూపులు కొనసాగాయి. ఒక గ్రూపు నిద్ర లేస్తే చంద్రబాబును తిట్టడమే పనిగా పెట్టుకుంటే, ఇంకో గ్రూపు చంద్రబాబు ఏమి చేసినా నీ అంతటివాడు లేడంటూ భజన చేస్తుండేది.

ఇప్పుడు కూడా రాష్ట్ర బీజేపీలో రెండు కూటములు తయారయ్యాయి. ఒక కూటమి ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డిపై విషం కక్కడమే పనిగా పెట్టుకుంది. ఎన్నికల తర్వాత బీజేపీలో చేరిన ఎంపీలు సుజనాచౌదరి, సీఎం రమేష్, గరికపాటి రామ్మోహన్‌రావులు నేతృత్వం వహిస్తున్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కన్నా లక్ష్మీనారాయణ వీరికి మద్దతుగా వుంటున్నాడు. సుజనాచౌదరి బీజేపీ మీద ప్రేమతో, భక్తి భావంతో ఆ పార్టీలో చేరలేదనే విషయం అందరికీ తెలుసు. కేవలం చంద్రబాబు బినామీగా, ఆయన ఏజెంట్‌గా, బీజేపీ నుండి ఆయనకు ప్రమాదం రాకుండా అక్కడ అన్నీ సర్దేందుకే బీజేపీలో చేరాడన్నది నగ్నసత్యం.

బీజేపీలో చేరినవాడు ఆ పార్టీ నియమ నిబంధనలకు లోబడి వుండకుండా తెలుగుదేశం తెలివితేటలు చూపిస్తున్నాడు. ప్రధాని నరేంద్ర మోడీకి తన మాటే వేద వాక్కు అన్నట్లు, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా తన జేబులో మనిషి అన్నట్లుగా ఆయన మాటలు కోటలు దాటుతున్నాయి. ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డిపైన విషం కక్కడానికి ఆయన పదేపదే కేంద్ర ప్రభుత్వాన్ని వాడుకుంటున్నాడు. ప్రధాన మంత్రి తనకే చెప్పి మాట్లాడమన్నట్లుగా ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నాడు. వేలకోట్లు బ్యాంకులకు ఎగ్గొట్టి, పలు ఆర్థిక నేరాలలో ఇరుక్కున్న ఈ ప్రబుద్ధుడు జగన్ ప్రభుత్వంపై చేస్తున్న ఆరోపణలు గురివింద గింజ సామెతను గుర్తు చేస్తున్నాయి.

రాజధానిని మారిస్తే కేంద్రం చూస్తూ వూరుకోదని సుజనాచౌదరి, కన్నా లక్ష్మీనారాయణలు ఘోషిస్తున్నా, వారికి ఆ పార్టీ నుండే కౌంటర్ పడింది. రాజధాని ఎంపిక పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వ ఇష్టమని, ఇందులో కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోదని, ఇది అధికారిక ప్రకటనేనంటూ బీజేపీ ఎంపి జిపిఎల్ నరసింహరావు చేసిన వ్యాఖ్యలు ఒక్కసారిగా వీళ్ళ నోర్లు మూయించాయి. జగన్‌పై ఒంటికాలితో లేస్తున్న సుజనా టీమ్‌కు 'షాక్' తగిలేలా చేశాయి.

ఇలా జగన్ దెబ్బకు రాష్ట్రంలో అన్ని పార్టీలు షేక్ అయ్యాయి. ప్రాంతాలవారీగా నాయకులు విడిపోయారు. అభివృద్ధి వికేంద్రీకరణ పేరుతో జగన్ విసిరిన పాచిక ప్రతిపక్షాలను కకావికలం చేస్తోంది.

# మండలికి... ఇక ముగింపే?

(మొదటి పేజీ తరువాయి)


అన్ని ప్రాంతాలకు విస్తరింప చేయాలన్న సంకల్పంతో ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి ముందడుగు వేశాడు. అయితే ఆయన ఆషామాషీగా మూడు రాజధానుల వైపు మొగ్గు చూపలేదు. శ్రీకృష్ణ కమిటి, శివరామకృష్ణ కమిటి ఇచ్చిన నివేదికలను పరిశీలించారు. ఇటీవల ఏర్పాటు చేసిన జిఎన్ రావు కమిటీ, బిసిజి, హైపవర్ కమిటీ ఇచ్చిన నివేదికలను అధ్యయనం చేశారు. అన్ని కమిటీలు కూడా చెప్పింది ఒక్కటే... అభివృద్ధి వికేంద్రీకరణ జరగాలని. అభివృద్ధి పేరుతో మంచి పంటలు పండే పొలాలను నాశనం చేయొద్దని.!

ఈ నేపథ్యంలోనే రాష్ట్ర ప్రభుత్వం మూడు రాజధానుల నిర్ణయాన్ని తెరమీదకు తెచ్చింది. పరిపాలన రాజధానిగా విశాఖపట్నంను, చట్టసభల రాజధానిగా అమరావతిని, న్యాయపాలన రాజధానిగా కర్నూలును ఎంపిక చేసింది. మూడు రాజధానుల నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో గత కొన్ని రోజులుగా అమరావతి పరిసర గ్రామాలలో ఆందోళనలు చేపట్టారు. మూడు రాజధానులు వద్దు, అమరావతి ఒక్కటే రాజధాని కావాలంటూ చంద్రబాబు రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలను లేవదీయాలనుకున్నాడుగాని, ప్రజల్లో ఎలాంటి కదలిక లేదు. ఇంకా ఒక మాటలో చెప్పాలంటే ప్రజలు మూడు రాజధానుల నిర్ణయాన్నే స్వాగతించారనుకోవచ్చు. అభివృద్ధి వికేంద్రీకరణకు శ్రీకారం చుట్టిన రాష్ట్ర ప్రభుత్వం దానికి చట్టపరమైన ఆమోదముద్ర వేసే ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. 21వ తేదీ ప్రత్యేక శాసనసభ సమావేశాన్ని నిర్వహించి సభలో అభివృద్ధి వికేంద్రీకరణ, సిఆర్‌డిఏ రద్దు బిల్లులను ఆమోదింపజేశారు.

## సెలెక్ట్ టు సెలెక్ట్...

శాసనసభ ఆమోదంతో ఒక అంశం ముగిసింది. అభివృద్ధి వికేంద్రీకరణ, సిఆర్‌డిఏ రద్దు బిల్లుపై 22వ తేదీ శాసనమండలిలో పెద్ద యుద్ధమే జరిగింది. మండలిలో తెలుగుదేశం బలం ఎక్కువ. గత ఐదేళ్లలో ఆ పార్టీ అధికారంలో వున్నందువల్ల వారికే మెజార్టీ ఎమ్మెల్సీలు దక్కాయి. ఇప్పుడు మండలిలో తమకున్న బలాన్ని ఆధారంగా చేసుకునే చంద్రబాబు ఈ బిల్లును అడ్డుకున్నాడు. మండలి ఛైర్మన్ ఎంఏ షరీఫ్‌ను తమ కనుసైగలతో శాసించి, ఆయనకున్న విచక్షణాధికారం ద్వారా బిల్లును ప్రజలచే ఎలెక్ట్ కాకుండా ప్రభుత్వంచే సెలెక్ట్ అయిన శాసనమండలి సభ్యుల ద్వారా సెలెక్ట్ కమిటీకి పంపించగలిగారు. బిల్లు ఆమోదం పొందకుండా ఓ మూడు నెలల పాటు తాత్కాలికంగా ఆపగలిగారు. అయితే, ఈ విషయంలో సిఎం వైయస్ జగన్మోహన్‌రెడ్డి వెనక్కు తగ్గే పరిస్థితి లేదు. ఈ బిల్లు ఆమోదానికి ఆయన పంతం పట్టినట్లు తెలుస్తోంది. ఈ విషయంలో బిల్లుకు అడ్డం అనుకుంటే శాసన మండలి రద్దుకు సైతం సీఎం జగన్ వెనుకాడడని తెలుస్తోంది. మండలి రద్దుకు కేంద్రం ఆమోదిస్తే చాలు. ఇలాంటి వాటిని ఆమోదించడానికి కేంద్ర ప్రభుత్వం ఎప్పుడూ సిద్ధంగా వుంటుంది.

చంద్రబాబు ఎన్ని ప్రయత్నాలు చేసినా, ఈయన సూచనలతో పవన్‌కళ్యాణ్ బీజేపీ అధిష్టానం కాళ్ళు పట్టుకుని ప్రాధేయపడ్డా జగన్ అనుకున్నది సాధించి తీరుతాడు... మూడు రాజధానుల అంశాన్ని నెగ్గించి చూపిస్తాడు. కాకపోతే కొంచెం ఆలస్యం కావచ్చు అంతే!



జననం - మరణం మధ్య ప్రయాణమే జీవితం. పుట్టడం - గిట్టడం రెండూ ఉభయ సంధ్యల లాంటివి. ఈ బుద్బుదప్రాయ జీవితంలో ఎన్నో పరిచయాలు. చాలావరకు పాలతరగల్లా కొద్దికాలంలోనే కనుమరుగవుతాయి. అయితే చాలా కొద్ది పరిచయాలు కలకాలం పరిమళిస్తాయి. మనసంతా ఆవరించి తనువెల్లా ఆర్ద్రత నింపుతాయి. ఆ స్నేహ వీచికలు తలపు వాకిట నిలిచినప్పుడల్లా అనిర్వచనీయ ఆనందం మదినిండా ఆవరిస్తుంది. ఈ స్నేహాలు అజరామరాలు. తుషారవేళ మిలమిల మెరిసే సూర్యకిరణాలు, రుతువులతో సంబంధం లేకుండా గలగల పారే సెలయేరు, ఆకాశమార్గం నుంచి ఉరికే జలపాతం. సుడిగాలి వేగంతో పరుగెత్తే జింక పిల్ల, నిన్నటి వరకు మొగ్గలా ఉండి నేడు విచ్చుకున్న పుష్పం... ఎంతటి ఆహ్లాదాన్ని కల్గిస్తాయో ఈ స్నేహాలు అంతే. అటువంటి అరుదైన స్నేహం నాకూ బాలుకి(డా॥యస్‌పి.బాలసుబ్రహ్మణ్యం) మధ్య పుష్పించింది. ఆ స్నేహం ఎలా చిగురించిందో.. అది ఎలా పల్లవించిందో... అది ప్రణవనాదంలా ఎలా నిలిచిపోయిందో.. మీతో పంచుకోవాలనుకుంటున్నాను.

**- డా॥ వరప్రసాద్‌రెడ్డి**

# బాలు ప్రజ్ఞా యశస్సు
# స్నేహ ఉషస్సు

నన్ను ప్రభావితం చేసిన వారి పరిచయాలు సాధారణంగా వారితోనే నేరుగా మొదలైతే శ్రీ బాలుగారితో నా సాంగత్య మూలం భిన్నమైంది. వారితో నా పరిచయం మొదలవ్వలేదు. ముందు నేను బాలుగారి తండ్రి స్వర్గీయ పండితారాధ్యుల సాంబమూర్తిగారి అభిమానిని. ఆ తర్వాతనే నాకు బాలుగారితో పరిచయం ఏర్పడింది. నాది - వారిది నెల్లూరు జిల్లానే అనే విషయం అందరికీ తెలిసిందే. నెల్లూరులోనే నేను మా మేనమామ ఇంట ఉండి చదువుకునే రోజుల్లోనే నాలుగో తరగతో, ఐదో తరగతో చదువుతున్నప్పుడు సాంబమూర్తి గారి హరికథలు అంటే చెవి కోసుకునేవాడిని. హరిదాసు వస్త్రధారణతో, చేతిలో చిడతల చప్పుడుతో లయబద్ధంగా ఆయన పాడుతుంటే నేను పరవశించి పోయేవాడిని. సంగీతం పట్ల నాలో అనురక్తి అంకురించింది అప్పటి నుండే. సాయంత్రాలు స్కూలు అయిపోయిన తర్వాత ట్యూషన్ నెపంతో ఛండశాసనుడైన మా మేనమామ కనుసన్నల నుంచి ఎలాగోలా బయటపడి... సాంబమూర్తిగారి హరికథ శ్రోతల్లో ఒకడిగా కూర్చుండిపోయేవాడిని. ఒకవేళ ఆయన వీధుల్లో తిరుగుతుంటే ఆయన వెంట పరుగెత్తేవాడిని. సాంబమూర్తి గారంటే వల్లమాలిన అభిమానం. ఆయన గాత్రం అంటే పులకింత. సుస్వరంతో ఇతిహాసాలకు వ్యాఖ్యానం చేస్తూ... పిట్టకథలు చెబుతూ శ్రావ్యంగా పాడుతుంటే మైమరచి పోయేవాడిని. ఏడాదిలో ఆయన హరికథలు చెప్పే రోజులలో అక్కడకు వెళ్లి వాలాల్సిందే. త్యాగరాజ ఆరాధనోత్స వాల సమయంలో సాంబమూర్తి గారి హరికథలు విని తరించాల్సిందే. ఆయన ప్రధాన వృత్తి కచేరీలు. అద్భుతంగా పాడేవారు. అప్పటికి నాకు బాలుగారు తెలియదు. ఆయన సాంబమూర్తి గారి అబ్బాయి అనీ తెలియదు.

నెల్లూరు నుంచి నేను ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ కోసం కాకినాడ వెళ్ళిపోయాక - నా స్నేహితుడు శంకర్ తన బ్రాంచ్ వేరుకావడం వల్ల అనంతపురం వెళ్ళిపోయాడు. ఇంజనీరింగ్‌లో తలమునకలుగా ఉన్నప్పుడు శంకర్ అప్పుడప్పుడు చెబుతూ ఉండేవాడు. ఇక్కడ మా కాలేజీలో ఒక అబ్బాయి సుబ్రహ్మణ్యం అని మన ఊరివాడే, స్టేజీల మీద పాడుతున్నాడని శంకర్ అంటుండేవాడు. అయినా నాకు కనెక్ట్ కాలేదు. ఇంజనీరింగ్ పూర్తి చేసుకొని - హైదరాబాద్‌లో నేను ఉద్యోగ ప్రస్థానంలో ఉన్నప్పుడు, అప్పటికే సంగీత అభిమానినైన నేను ఘంటసాల గాత్రానికి ఫిదా అయ్యాను. పైగా అవి ఘంటసాల స్వరం సినీ సంగీత సామ్రాజ్యాన్ని ఏలుతున్న రోజులు. అందరిలాగానే ఆయన పాటలు వింటుండేవాడిని. అప్పుడప్పుడు సుబ్రహ్మణ్యం అనే యువ గాయకుడి గాత్రం అక్కడక్కడా విన్పించినా నిజం చెప్పొద్దూ... ఎందుకో నా మనసులో ముద్ర పడలేదు.

★★★★★

శాంత బయోటెక్నిక్స్ సొంత కంపెనీని స్థాపించి - కింద మీదా పడుతున్నప్పుడు - అంతటి అవిశ్రాంత పోరాటంలో నాకు స్వాంతన సంగీత - సాహిత్యాలే. అందులోనే నేను సేదతీరేవాడిని. కాబట్టి ఏ కాస్త సమయం దొరికినా ఏదో ఒకటి వింటుండేవాడిని. ఆ రసాస్వాదనలో నా వత్తిడిని మరిచిపోయేవాడిని. అలాంటి సమయంలో ఒకసారి "ఇంకా తెలవారదేమి.. ఈ చీకటి విడిపోదేమి" అన్న పాటను ఘంటసాల, బాలు కలిసి పాడారు. అందులో ఘంటసాలతో సమానంగా అదే పిచ్‌లో పాడిన రెండో స్వరం బాలసుబ్రహ్మణ్యం అనే యువ గాయకుడిదని తెలిసి ముగ్ధుడినయ్యాను. అలాగే మరోపాట... ప్రతిరాత్రి వసంతరాత్రి పాటలో ఘంటసాల గారి కంఠంలో గాంభీర్యం, బాలుగారి స్వరంలో మాధుర్యం ఆస్వాదించాను. ఒకసారి ఒకరి సంగీతం నచ్చితే నా జిజ్ఞాస ఆగదు. కొద్దిరోజుల్లోనే ఆ యువగాయకుడు నెల్లూరులోని నాటి మా పండితారాధ్యుల సాంబమూర్తి గారి అబ్బాయి పండితా రాధ్యుల బాలసుబ్రహ్మణ్యం అని తెలిసి సంతోషించాను.



ఆ తర్వాత వేర్వేరు నటులకు బాలుగారు పాడుతున్న తీరు విని ఆయన స్వరవైవిధ్యాన్ని, మనసులోనే అభినందించేవాడిని గానీ పరిచయం లేదు. ఆ ఘడియ కాస్తా రానే వచ్చింది.

★★★★★

శాంత కంపెనీ పని మీద ఒకసారి మద్రాస్ వెళ్ళి హైదరాబాద్ వస్తుంటే ఫ్లయిట్‌లో బాలుగారు కన్పించారు. కాలుకి ఫ్రాక్చర్ బాండేజీతో ఉన్నారు. దగ్గరకు వెళ్ళి పరిచయం చేసుకున్నాను. అప్పటికే బాలుగారు సినీ గాయకుడిగా పేరులోకి వచ్చేశారు. ఆయన అభిమానిగా ఎవరైనా పరిచయం చేసుకుంటారు. కానీ నేను వారి నాన్నగారి అభిమానిగా పరిచయం చేసుకున్నాను. "అలాగా... చాలా సంతోషమండి" అని సంబరపడ్డారు. పెద్ద గాయకుడిగా పేరు తెచ్చుకున్నా, మనిషిలో గర్వం ఛాయలు కనపడకపోవడం, ఆయన సింప్లిసిటీ నన్ను తొలి పరిచయంలోనే ఆకట్టుకున్నది. "ఈసారి మద్రాస్ వచ్చినపుడు మా ఇంటికి రండి" అని ఆప్యాయంగా పిలిచారు. కొత్త ఇండస్ట్రీ పని ఒత్తిడిలో వెంటనే కుదరలేదుగానీ, తర్వాత ఎప్పుడో వీలైనపుడు వారి ఇంటికి వెళ్ళి కుటుంబసభ్యులందరినీ కలిశాను. అలా మొదలైంది బాలుగారితో నా పరిచయ ప్రయాణం. అప్పటినుండి ఈ రెండు దశాబ్దాల పాటు మా మధ్య స్నేహం పెరుగుతూ వస్తోంది. అందుకు కారణం మమ్మల్ని కలిపిన సంగీతమే.

★★★★★

ఆ తర్వాత రెండు విషయాలు నన్ను - బాలుగారికి సన్నిహితం చేశాయి. ఒకటి ఆయన గానవైదుష్యం, రెండు ఆయన వ్యక్తిత్వ పరిమళం. నాకున్న సంగీతాభిలాష దృష్ట్యా కొన్ని ఆల్బమ్స్ బాలుగారి చేత చేయించాను. ఎక్కడిదీ హాయి, కాలం చిరుకొమ్మ మీద లతోపాటు అన్నమాచార్య కీర్తనలు అద్భుతంగా పాడారు. మా ఇంటికి రమ్మని ఆహ్వానించినపుడు బాపూ-రమణలు వస్తుంటారని చెప్పాను. ఎంతో ఆనందించి "వాళ్ళంటే నాకు చాలా ఇష్టమండి. తప్పక వస్తానన్నారు." ఆ తర్వాత తరచూ కలుస్తుండేవాళ్ళం. ఆయన లోని ప్రతిభకు ఎంతగా ఆకర్షితుడినయ్యానో, ఆయన వ్యక్తిత్వం నన్ను అంతగా ఆకట్టుకున్నది. బాలుగారి వ్యక్తిత్వ అంశాలను "పాడుతా తీయగా" కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వెళ్ళినపుడు రాసుకు వెళ్ళాను.

### మాధుర్యం

బాలు పాటల్లో మాధుర్యం ఉంటుంది. హృదయంలో మాధుర్యం ఉంటుంది. లేకపోతే అది స్వరంలో ప్రతిఫలించదు. మనసు పాషాణమైతే మాట కటువుగా ఉంటుంది. అదే మనసులో ఆర్తి, చెమ్మ ఉంటేనే పాటలో మాధుర్యం జాలువారుతుంది.

### సౌజన్యం

బాలు సౌజన్యమూర్తి. మనిషి లోపల సహనశీలి అయితేనే సౌజన్యంగా వ్యవహరించగలడు. దీనికి హృదయమే మూలం.

### స్నేహం

బాలుగారు స్నేహానికి ప్రాణం పెడతారు. నాకు మనసు బాగోలేదంటే ఎంత బిజీగా ఉన్నా అన్నీ పక్కనపెట్టి వచ్చేస్తారు. తన ప్రియవచనాలతో స్వాంతన పరుస్తారు. స్నేహానికి అంతగా కట్టుబడి ఉండేవారు అరుదు.

### సంస్కారం

ఆయనలోని సంస్కారాన్ని మరెవ్వరితో పోల్చలేం. అంతటి గాయకుడైనా నిగర్వి. తనను నొప్పించిన విషయాన్నయినా సంస్కారయుతంగా చెబుతారు. గానసభల్లో సెల్‌ఫోన్లు మాట్లాడుతూ కన్పించారనుకోండి 'దయచేసి వాటిని కాసేపు ఆపండి. లేకపోతే నేనే కాసేపు పాడటం ఆపుతాను' అని సుతిమెత్తగా చెబుతారు. అంతే తప్ప చిరాకుపడటం మచ్చుకైనా కన్పించదు.



### వినయం

కృతజ్ఞతాభావం, వినయాలకు బాలు ప్రతిరూపం. లతా మంగేష్కర్, జేసుదాస్ వంటి సీనియర్ గాయకులు కన్పించగానే పాదాలకు నమస్కరిస్తారు. తనకు కెరీర్ ఇచ్చిన కోదండపాణి గారంటే ఎనలేని అభిమానం. తన స్టూడియోకు ఆయన పేరే పెట్టారు. ప్రతి సంగీత కచేరీలోనూ ఆయన పేరును స్మరిస్తారు.

### ఆదర్శం

ప్రతివారు తనకు పోటీనే అనుకునే సినీ రంగంలో కొన్ని దశాబ్దాల నుంచి కొన్ని వేలమంది ఔత్సాహిక గాయనీ గాయకులను మంచి గాయకులుగా తీర్చిదిద్దుతున్నారు. తాను నేర్చుకున్న విద్యను వారికి నేర్పే ఆదర్శప్రాయులు. బాలుగారి ఈ వ్యక్తిత్వ లక్షణాలన్నీ నన్ను అమితంగా ప్రభావితం చేశాయి. గాయకులు ఎంతోమంది ఉండవచ్చు. ప్రజ్ఞావంతులైన గాయకులు ఉండవచ్చు. కానీ తన వ్యక్తిత్వ లక్షణాలతో విలక్షణంగా నిలిచిన గాయకులు శ్రీ బాలసుబ్రహ్మణ్యం. ఒకప్పుడు ఆయన నాన్నగారిని అభిమానించిన నాకు ప్రస్తుతం బాలుగారితో స్నేహమాధుర్యాన్ని పంచుకోవడం నా అదృష్టం.

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com